


ఉష్ణోగ్రత (అంచనా)

22-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	26
తెనాలి	39	26
నరసరావుపేట	40	25
బాపట్ల	37	27
రెంటచింతల	42	25

కొలిక్కి వస్తున్న రీ సర్వే



- తప్పులు సరిచేస్తూ...సమగ్రంగా
- పైలట్ ప్రాజెక్టుగా గతంలోనే మండలానికో గ్రామం
- రెండో విడత కూడా ప్రారంభం
- ఇప్పటికే గ్రామ సభలు పూర్తి.. హద్దులు గుర్తింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం రీ సర్వే పేరిట చేసిన ప్రహసనం భూములకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టిందే తప్ప రైతాంగానికి ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. ప్రణాళికలు లేకుండా చేపట్టిన రీ సర్వే తంతుతో ప్రభుత్వం మారగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్జీలు ప్రభుత్వానికి అందాయి. వీటిలో అధికశాతం భూ సంబంధమైనవే కావడం గమనార్హం. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో పక్కా ప్రణాళికతో మండలానికి ఓ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే నిర్వహించింది. ఈ గ్రామాలన్నీ కూడా గత ప్రభుత్వంలో రీ సర్వే చేయనివే కావడంతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీ సర్వేని యంత్రాంగం చేపట్టింది. కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలు మినహా రీ సర్వే ఓ కొలిక్కి వచ్చే సరికి ఆయా గ్రామాల్లోని రికార్డుల్లో ఎలాంటి తకరారు లేకుండా పక్కాగా ఆర్‌వోఆర్ ఉండాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. దీనికి అనుగుణంగానే ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటికే జీటీ పూర్తి చేసిన యంత్రాంగం 9(2) కింద గ్రామాల్లో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు జారీ చేసి అభ్యంతరాలను స్వీకరించింది. వాటిని డిస్పోజ్ కూడా చేసింది. డీఎల్ఆర్ అంకాన్ని కూడా ముగించిన యంత్రాంగం చివరిగా ఆర్‌వోఆర్ సిద్ధం చేసి గ్రామాల్లో జాబితా ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా కూడా దాదాపుగా ముగింపుకొచ్చింది. ఆ తర్వాత రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ వివాదం అనే మాటే వినిపించకూడదనేది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగా రీ సర్వేని పక్కాగా చేపట్టడానికి ఆ విధుల్లో ఉన్న సిబ్బందికి వేరే డ్యూటీలు వేయకుండా అన్ని వసతులు సమకూర్చి పూర్తి పారదర్శకంగా రీ సర్వే జరిగేలా ప్రభుత్వం తోడ్పాటునందించింది

రెండో విడత రీ సర్వే ఇప్పటికే ప్రారంభం

ప్రభుత్వం దశల వారీగా అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది. దీనిలో భాగంగానే పైలట్ గ్రామాల్లో రీసర్వే కొలిక్కి వస్తుండగానే గుంటూరు జిల్లాలో 18, పల్నాడులో 28, బాపట్ల జిల్లా పరిధిలోని 25 గ్రామాల్లో ఈ నెల 2 నుంచి మలివిడత రీసర్వే ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే గ్రామ సభలను పూర్తి చేసిన యంత్రాంగం హద్దులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేస్తోంది. తొలుత మండలానికి రెండు గ్రామాల చొప్పున రెండో విడత రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం తలంచింది. దీనికి అనుగుణంగానే తొలుత ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ఇటీవల మండలానికో గ్రామంలోనే రీ సర్వే చేపట్టే విధంగా ఆదేశాలను సవరించారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పాటు కచ్చితత్వంతో కూడిన ఫలితాలను రాబట్టాలనే ఉద్దేశంతో రెండో విడత రీ సర్వే గ్రామాలను కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పైలట్ గ్రామాల్లో ప్రభుత్వం ఎంచుకున్న



రెండో విడత రీ సర్వేలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్వహిస్తున్న గ్రామ సభ (పాత చిత్రం)

నమూనా సత్ఫలితాలు ఇవ్వడంతో అదే ప్రక్రియలో మొత్తం భూములకు రీ సర్వే చేపట్టి భూ యజమానులకు భరోసా అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇదిలా ఉంటే రెండో విడతలో మూడు జిల్లాలో ఎంచుకున్న 71 గ్రామాల్లో వైసీపీ హయాంలో రీ సర్వేని ప్రారంభించి సగంలో కాడి వదిలేసిన 35 గ్రామాలను కూడా జాబితాలో సర్వే విభాగం చేర్చింది. ఇప్పటికే పైలట్ గ్రామాల్లో రీ సర్వే విజయవంతం కావడంతో పాటు ప్రభుత్వం ఎంచుకున్న నమూనా, యాప్ వినియోగంపై సిబ్బందికి ఓ అవగాహన వచ్చింది. దీంతో రెండో విడత కింద ఎంచుకున్న గ్రామాల్లో రీ సర్వే ఘట్టాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చి ఫలితాలు చూపెట్టాలని ఆదేశించింది. గడువులోపల రీ సర్వే పూర్తి చేయాలనే పట్టుదలతో యంత్రాంగం అడుగులేస్తోంది

అభ్యంతరాల విషయంలో ఏకాభిప్రాయంతోనే..

రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో వచ్చే అభ్యంతరాలకు సంబంధించి ఇరు పార్టీల అంగీకారంతోనే ఓ నిర్ణయానికి వస్తున్నామని సర్వేతో పాటు రెవెన్యూ విభాగం చెబుతోంది. అప్పటికీ ఒప్పుకోని పక్షంలో సహేతుకతలేని వినతులని తిరస్కరించి ముందుకు వెళుతున్నామని అధికారులు చెబుతున్నారు. మరింత సంక్లిష్టంగా ఉన్నవాటి విషయంలో రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. వైసీపీ హయాంలో రీ సర్వే జరిగిన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 11,000 అర్జీలు

(మిగతా 6వ పేజీలో)

తెల్లబోతున్న జొన్న



మొన్నటి వర్షాలకు తడిచిన తెల్ల జొన్నలు

ధర లేదు... కొనే దిక్కూలేదు

- మొక్కజొన్న కూడా చేలల్లోనే అమ్మకాలు
- కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని మార్కెటింగ్ శాఖ
- వర్షాలకూ దెబ్బతిని బోరుమంటున్న జొన్న రైతులు
- రంగు మారటంతో రేటు విషయంలో కోతకోస్తున్న వ్యాపారులు
- జొన్న మద్దతు ధర రూ. 3460... మార్కెట్ రేటు రూ. 1700లే
- అంతా దగానే... ఆదుకోకుంటే రైతన్నకు నష్టమే

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ సాగుకింద పండిన మొక్కజొన్న, జొన్న పంటలు చేతికొచ్చాయి. పంట అందుతున్న తరుణంలోనే వర్షాలూ వెంట వచ్చాయి. తడిచిపోవటం, పంట దెబ్బతినటం వంటివన్నీ ఒకెత్తయితే, పంట చేతికొచ్చినా అమ్ముకోలేని స్థితిలో రబీ రైతన్న ఉన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే పండించిన పంట కొనే దిక్కులేక అల్లాడుతున్నాడు. జొన్నకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర ఆకాశంలో ఉంటే, మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధర పాతాళంలో ఉంది. అంటే... మార్కెట్ దరకు, వ్యాపారులు కోతకోసి మరీ కొంటున్న ధరకు అంత వ్యత్యాసం ఉందన్నమాట. మొక్కజొన్నకు కొంత వరకు పర్వాలేదనిపిస్తున్నా, జొన్నరైతే దిగాలు పడుతున్నాడు. పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు తాము జొన్నలు, మొక్కజొన్న కొనబోమని ఆలస్యంగా కబురు చెప్పటంతో జొన్నరైతన్నది దిక్కుతోచని స్థితి. పండించిన పాపానికి ఎంతోకొంత దక్కితే చాలని వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తే వర్షాల సాకుచూపి, తేమ ఉందని, రంగు మారిపోయాయంటూ మద్దతు ధరలో సగమే ఉన్న రేటు మరింత కోత కోసి రైతన్నను దగా చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా దక్కక రైతన్న దిగాలు పడుతుంటే, కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.



తెల్ల జొన్నలను గోతాలకెత్తుతున్న కూలీలు

తెనాలి, వేమూరు, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, వాటిలో రబీ కింద మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర పంటలు సాగయ్యాయి. వీటిలో మొక్కజొన్న, జొన్న పంటల సాగే ఎక్కువగా ఉంది. జొన్న 3.9 లక్షల ఎకరాల్లో సాగయితే, జొన్న 1.3 లక్షల ఎకరాల్లో సాగయిందనేది అధికారుల మాట. మిగిలిన విస్తీర్ణంలో మినుము, పెసర పంటలు వేశారు. అయితే వీటన్నిటికీ రేటు కొంత వరకు పర్వాలేదనిపించినా, తెల్లజొన్నకు మాత్రం దారుణంగా ఉంది.



దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే మొక్కజొన్నకు మాత్రం మార్కెట్ రేటుకూడా మద్దతు ధరకు దగ్గరగా ఉండటంతో రైతులకు పెద్దగా నష్టం జరిగేదిలేదు. క్వింటా మొక్కజొన్నలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2,225గా ఉంది. అయితే మార్కెట్‌లో క్వింటాకు రూ. 2,100 నుంచి రూ. 2,200 వరకు వ్యాపారులే చెల్లిస్తుండటంతో రైతులు పెద్దగా కొనుగోలు కేంద్రాలకోసం ఎదురు చూడటంలేదు. శనివారం బాపట్ల జిల్లాలో క్వింటాకు ఖర్చులతో రైతులకు పనిలేకుండా రూ. 2120 రేటు చెల్లిస్తే, ఖర్చులతో రూ. 2,200 చెల్లించారని, దీనివల్ల పెద్దగా ఇబ్బందిలేదని, చేలల్లోనే వ్యాపారులు మద్దతు ధరకు దగ్గరగా ఇచ్చి కొంటున్నారని చెబుతున్నారు.


మద్దతు ధర రూ. 3,460... కొనేది రూ. 1700లకే

జొన్న డెల్టాలో 1.3 లక్షల ఎకరాల్లో సాగయితే దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వచ్చింది. ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడులు రైతులకు దక్కాయి. కొన్ని చోట్లయితే 30 క్వింటాళ్లు కూడా వచ్చాయి. అయితే జొన్న మద్దతు ధర క్వింటాకు భారీగానే కేంద్రం నిర్ణయించింది. దీనిలో తెల్లజొన్న హైబ్రిడ్‌వయితే క్వింటాకు రూ. 3,371, మాల్దండి రకం జొన్నకయితే రూ. 3,421గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మద్దతు ధర కేవలం కాగితాలకే పరిమితమయింది.ప్రస్తుతం అంతా బాగున్న జొన్నలయితే క్వింటాకు వ్యాపారులు రూ. 2100 వరకు చెల్లిస్తున్నారు. అయితే ఎక్కువ శాతం సాకులుచూపి ధరలో కోత కోసేస్తున్నారు. తడవకుండా, మంచుకు రంగు మారినా, వర్షాలకు తడిచాయన్న సాకులు

(మిగతా 6వ పేజీలో)

త్వరలో మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్?

- గుంటూరు, విశాఖపట్నంలకు ఒకేసారి ఎన్నికలు



గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు రెండు, మూడు రోజుల్లో ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని అధికారవర్గాలు ధ్రువీకరించాయి. నిన్న మొన్నటి వరకు మేయర్‌గా వ్యవహరించిన వైసీపీ నేత కావటి మనోహర్‌నాయుడు అవిశ్వాసాన్ని ఎదుర్కోలేనని భావించి ముందుస్తుగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన రాజీనామా లేఖను నగరపాలక సంస్థ అధికారులు ప్రభుత్వానికి పంపగా ప్రభుత్వం నుంచి ఎలక్షన్ కమిషన్‌కు వెళ్ళింది. తాత్కాలిక మేయర్‌గా డిప్యూటీ మేయర్ షేక్ సజీల వ్యవహరిస్తున్నారు. కాగా నగరపాలక సంస్థలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్న కోవెలమూడి నానిని మేయర్ పీఠం ఎక్కించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకోవటంతో ఆ పదవిని చేపట్టేందుకు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు తాడికొండ వచ్చిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నానీతో మాట్లాడుతూ మేయర్ ఎన్నిక విషయంపై ఆరా తీశారు. ఎలక్షన్ కమిషన్ నుంచి నోటిఫికేషన్ రావాల్సి ఉందని తెలియజేయగా తాను ఫాలో అప్ చేస్తానని చెప్పినట్లు సమాచారం. కాగా ఈలోగా విశాఖపట్నం నగరపాలక సంస్థలో వైసీపీ మేయర్‌పై కూడా అవిశ్వాసం ప్రకటించి నెగ్గిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి మేయర్ పీఠాన్ని కూడా కూటమి పార్టీ కైవసం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో రెండు నగరపాలక సంస్థల మేయర్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఒకే సారి జారీ చేసే అవకాశం ఉందని కూటమి నేతలు భావిస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు. నగరపాలక సంస్థలో మొత్తం 57 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో ఒకరు మరణించారు. మిగతా 56 మందికి గాను టీడీపీ పక్షాన 23 మంది కార్పొరేటర్లు, జనసేన తరుపున ఆరుగురు, వైసీపీ తరుపున 27 మంది ఉన్నారు. వీరు కాకుండా ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ కూడా నగరపాలక సంస్థలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో ఎన్నిక ఏ క్షణాన జరిగినా మేయర్ పీఠం కూటమి పార్టీ పరం కానున్నది.

శంకర్ విలాస్ ఆర్వోబీపై అపోహలొద్దు

- అత్యుత్తమ డిజైన్‌తో రూపొందిస్తున్నాం
- ప్రభావిత యజమానులకు నష్ట పరిహారం పంపిణీ
- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ వద్ద ఆర్వోబీని అత్యుత్తమ డిజైన్లతో అందరికీ ఆమోదయోగ్యంగా అతితక్కువ కాలంలోనే నిర్మాణం చేపట్టనున్నామని, అపోహలకు గురి కాకుండా ప్రజలు సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమావేశంలో శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ ప్రభావిత భవనాల యజమానులకు నష్టపరిహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు 40 ఏళ్ళ అనంతరం దక్కిన కేంద్ర మంత్రి పదవిని అదృష్టంగా భావిస్తూ దీనిని సద్వినియోగం చేసుకొని, కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు సహకారంతో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి అతితక్కువ కాలంలోనే అన్ని రకాల అనుమతులు, నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. గతంలో నందివెలుగు రోడ్డులో ఆర్వోబీని 2014లో మంజూరు చేస్తే పనులు ప్రారంభించడానికి 2017 వరకు సమయం పట్టిందని, కానీ శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆరు నెలల్లోనే పూర్తి చేయటం జరిగిందన్నారు. ఆర్వోబీ నిర్మాణంపై కొంత మంది కావాలని అపోహలు సృష్టిస్తున్నారని, రహదారి విస్తరణ కోసం అక్కడ జీవనోపాధి పొందుతున్నవారికి కొంత ఇబ్బంది జరుగుతుందని, కానీ విశాల దృక్పధంతో అర్థం చేసుకొని స్థలాలు ఇవ్వడానికి సమ్మతించిన భవన యజమానులకు కూటమి ప్రభుత్వం తరఫున అభినందనలు తెలుపుతున్నామన్నారు. అయితే కొంత మంది తెలిపిన అభ్యంతరాలపై అధికారులతో నాలుగుసార్లు సమావేశం నిర్వహించి, అన్ని సమస్యలకు పరిష్కారం చూపటం జరిగిందన్నారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం నిర్మిస్తున్న ఆర్వోబీ వద్ద అవసరమైతే భవిష్యత్తులో ఆర్‌యూబీ సైతం నిర్మించేలా డిజైన్ చేయటం జరిగిందన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ కోర్టులను ఆశ్రయించిన భవన యజమానులకు భూసేకరణ ద్వారా నష్ట పరిహారం అందించాలని కోర్టు ఆదేశించటం జరిగిందని, భూసేకరణ ద్వారా పరిహారం తక్కువగా వస్తుందని వారికి తెలియచేయటంతో వీరిలో ఆరుగురు ఇప్పటికే నిర్మాణాలకు నష్టపరిహారం, టీడీఆర్ బాండ్లు తీసుకోవడానికి సమ్మతి తెలిపారన్నారు. మిగతావారికి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి వీలుగా బీఎస్ఎన్ఎల్, విద్యుత్, కేబుల్ వైర్లు నిర్దేశిత సమయంలో పక్కకు తరలించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆర్వోబీ పునర్ నిర్మాణంలో ఉన్న చిన్న ఇబ్బందులను కొంత మంది స్వార్థపరులు దుష్ప్రచారం చేస్తూ బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ శంకర్ విలాస్ వద్ద నూతన ఆర్వోబీ నిర్మాణం చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కోరిన నేపథ్యంలో కేంద్ర మంత్రి కృషి చేసి నిర్మాణానికి సంబంధించిన డిజైన్లు రూపొందించటం జరిగిందన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఆర్వోబీ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్న వారు భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభానికి ముందే నష్ట పరిహారం ఇవ్వడం ప్రజల పట్ల కూటమి ప్రభుత్వ అంకితభావం, అధికారుల కృషికి తార్కాణమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు మాట్లాడుతూ ఆర్‌ఓబీ పనులను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మీ, ఇన్‌చార్జి మేయరు సజీలా ఏపీఐడీసీ చైర్మన్ ప్రభాకరరావు, అదనపు కమిషనర్ ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, టీడీపీ ఫ్లోర్ లీడర్ రవీంద్ర, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



శంకర్ విలాస్ ఆర్‌ఓబీ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, కలెక్టర్, కమిషనర్, ఇన్‌చార్జి మేయర్, ఎమ్మెల్యేలు

ప్రమాణాలకే.. ప్రాధాన్యం



- ఇంటర్ విద్యలో నూతన మార్పులకు శ్రీకారం
- జాతీయస్థాయి ప్రమాణాలే లక్ష్యంగా సిలబస్, బోధన
- ఏపీ ఈ ఏపీ సెట్‌కు ఉపయోగం అధ్యాపకులకు త్వరలో శిక్షణ

గుంటూరు(విద్య) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు, ప్రమాణాలే లక్ష్యంగా ఇంటర్ విద్యలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దీంతోపాటు రాష్ట్ర స్థాయిలో ఏపీ ఈఏపీసెట్(ఎంసెట్) ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు ఈ మార్పులు ఉపయోగపడనున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని సబ్జెక్టులను కుదించి ఒకే సబ్జెక్టుగా మార్చడం. సిలబస్, పరీక్షల విధానం, మార్కుల కేటాయింపు తదితర అంశాల్లో కొత్త విద్యా సంవత్సరం నుంచి నూతన మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు రానున్నాయని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ ఆధ్వర్యంలో 35 పైగా జూనియర్ కళాశాలలు, వృత్తి విద్య కళాశాలలు ఉన్నాయి. ఇంకా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్, గురుకుల జూనియర్ కళాశాలలో మరో 50 వరకు ఉన్నాయి. అదేవిధంగా, ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో 100కు పైగా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సరాల్లో దాదాపు 80 వేల మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారు .

ఇంటర్‌లో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ ప్రధాన గ్రూపులు ఉన్నాయి .వీటితో పాటు ఎంబైపీసీ గ్రూపును కూడా ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టడానికి ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తున్నది. మరో వైపు వృత్తి విద్యా కళాశాలల్లో కూడా నూతన కోర్సులు సిలబస్ లో మార్పులపై అధ్యయనం చేస్తున్నారు.

ముందస్తు తరగతులు.. పుస్తకాల పంపిణీ

ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం ఇప్పటికే అనేక కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. గత నెల 24 నుంచి దాదాపు నెల రోజుల పాటు తరగతులు నిర్వహించారు .ప్రధాన సబ్జెక్టుల్లో రెండు మూడు యూనిట్లు కూడా పూర్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కూడా ప్రారంభించారు.

ఇంటర్ సిలబస్‌లో మార్పులు ఇలా ..

ఇంటర్ ఇప్పటివరకు మాథ్స్ ఏ, బి సబ్జెక్టులు ఉన్నాయి. వీటిని ఒకే సబ్జెక్టుగా చేయనున్నారు. బోటనీ జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా (మిగతా 6వ పేజీలో)

అధ్యాపకులకు శిక్షణ కోసం కసరత్తు

ఇంటర్ బోధించే అధ్యాపకులకు మారిన సిలబస్ నూతన విధానాల ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. జాతీయస్థాయి పరీక్షలకు అనుగుణంగా మారిన సిలబస్‌లో బోధన ఎలా చేయాలి.. , విద్యార్థుల్ని పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలి .. వంటి అంశాలపై పునఃచరణ తరగతులు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ వేసవి సెలవుల్లోనే పునశ్చరణ తరగతులు పూర్తిచేసి జూనియర్ కళా శాలల ప్రారంభం నాటికి అధ్యాపకులను బోధనకు సన్నద్ధం చేయాలని యోచిస్తున్నారు.



వరి కుప్పకు నిప్పు

వేల్పూరు(శావల్యాపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వరి పంట గూడుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని వేల్పూరు గ్రామంలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాదినేని వీరాంజనేయులు ఇర్లపాడుకు వెళ్లే డొంక దారిలో తనకున్న ఎకరం పొలంలో గత డిసెంబర్‌లో వరి పంట కోసి గూడు వేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున దానికి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకొన్న వీరాంజనేయులు గ్రామస్తులతో కలసి పొలానికి వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా.. అప్పటికే పంటగూడు పూర్తిగా కాలిపోయింది. పంట విలువ రూ.75 వేలు ఉంటుందని, ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే దుండగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వేల్పూరులో ఇటీవల పొలంలో నిల్వ చేసిన పొగాకు బేళ్లు, గ్రామంలోని దొడ్డిలో వేసిన గడ్డివామిని కూడా ఇలానే కాల్చివేశారని, గ్రామానికి చెందిన వ్యక్తి ఒకరు ఇలాంటి దుర్చర్యలకు పాల్పడుతున్నాడని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావును కలసి ఫిర్యాదు చేశామని తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రమాణాలకే.. ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

మారుస్తున్నారు. దీనికి అనుగుణంగా మార్కుల కేటాయింపు చేస్తారు. పార్ట్ -1లో ఆంగ్లం , పార్ట్ 2లో జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. విద్యార్థి తన అభిరుచి మేరకు ఏదైనా సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇంటర్ బోర్డు కల్పించనుంది. పార్ట్ -3లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు ను కూడా ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ఇటు ఇంజనీరింగ్ అటు మెడికల్ ప్రవేశ పరీక్షల్లో కూడా విద్యార్థులు పాల్గొనే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉంటే పార్ట్ 1, 2, 3లలో వచ్చిన మార్కులే పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో కనీసం ప్రతి సబ్జెక్టులో 35 మార్కులు రావాల్సి ఉంటుంది. వృత్తి విద్యా కోర్సుల్లో పాస్ మార్కుల్లో వ్యత్యాసం ఉంది. ఇక ఇంటర్‌లో విద్యార్థి ఎంచుకున్న అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు అయితే మెడికల్, ఇంజనీరింగ్ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్ వంటి కోర్సులు అధ్యయనానికి ఉపయోగపడతాయని అధ్యాపకులు చెప్తున్నారు.



ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల

ప్రశ్నాపత్రంలో మార్పులు

ప్రశ్నాపత్రం విషయంలో మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ గ్రూపుల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం, ఆర్ట్స్ గ్రూపుల్లో హ్యూమానిటీస్ విధానాలను అనుసరించారు. సైన్స్ సబ్జెక్టుల్లో 85 మార్కులకు, ఇతర సబ్జెక్టుల్లో వంద మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రయోగ పరీక్షలకు 30 మార్కులు కేటాయిస్తారు. ఇలా అనేక నూతన మార్పులకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుడుతోంది. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీ పరీక్షలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా నూతన మార్పులు దోహదపడతాయని అధ్యాపకులు చెబుతున్నారు.

తెల్లబోతున్న.. జొన్న

(5వ పేజీ తరువాయి)

చూపించి కొద్దిగా రంగులో వ్యత్యాసం కనిపించినా రూ. 1700 నుంచి రూ. 1800 వరకుమాత్రమే కొంటామని, లేకుంటే తీసుకుపోవాలంటూ తిప్పి పంపుతున్న పరిస్థితి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాలు ఉంటే, మరో ప్రత్యామ్నాయం రైతుల ముందుండేది. ఇప్పుడు ఏదీ లేకపోవటంతో వ్యాపారులు, దళారులు బెదిరిస్తున్నా చేసేదిలేక వారు చెప్పిన రేటుకే తెగ నమ్ముతున్నారు. మరోపక్క నిల్వ ఉంచుకుందామన్నా, మొక్కజొన్నయితే పర్వాలేదు కానీ, తెల్లజొన్న ఏమాత్రం రంగు మారినా, బూజుపట్టినా రేటు విషయంలో అసలుకే నష్టం వస్తుందనే ఆలోచనతో రైతులు నిల్వ ఉంచటానికి ధైర్యం చేయటంలేదు.

జొన్నలు కొంటామని ఒకసారి... పొరపాటు పడ్డాం కొనలేమని మరోసారి...

జొన్నలు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేస్తాం... రేటు లేదని ఆందోళన పడాల్సిన పనిలేదు... ఇదీ గత వారం క్రితం పౌరసరఫరాల శాఖ అధికారులు చేసిన ప్రకటన. లేదు... లేదు... మీ జొన్నలు మేం కొనలేం. మేమే పొరపాటు పడ్డాం. మనుషులు తినేవి కాదు కనుక మేము కొనటానికి వీలులేదంటూ రెండు రోజుల తర్వాత మరో ప్రకటన. మొదటి ప్రకటన వచ్చినప్పుడు రైతులంతా సంతోషించారు. తమ జొన్నలు రేటు లేనితరుణంలో ప్రభుత్వం కొంటుంది కనుక నష్టం ఉండదని ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. రెండు రోజుల్లోనే మరో ప్రకటన కూడా అధికారుల నుంచే విడుదలయిందని, కేంద్రం సూచించిన ప్రకారం మన ప్రాంతంలో పండించే జొన్నలు మనుషులు తినేందుకు పనికివచ్చేవి కాదని, వాటిని పరీక్షిస్తే హానికర క్రిమిసంహారకాలు పెద్ద మోతాదులో ఉన్నట్టు తేలిందని, అందువల్ల ఆ జొన్నలు కొనలేమంటూ మరో ప్రకటన చేశారని రైతులే చెబుతున్నారు. దీని ప్రకారం చూస్తే ఇకపై కొనుగోలు కేంద్రాలు రబీ పంటల కొనుగోలుకు ఉండవనేది తేలిపోయిందని, అర్థంతరంగా ఇటువంటి నిర్ణయం తీసుకుంటే ఎట్లాగంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ. 3,460 అవసరం లేదని, కనీసం రూ. 2400 నుంచి రూ. 2600 వరకు జొన్నల నాణ్యతనుబట్టి రేటు నిర్ణయించినా చాలని వేడుకుంటున్నారు. కేంద్రాలు తెరవలేని పక్షంలో కనీస ధర అందేలా చూడాలని, ప్రభుత్వం దీనిపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోకుంటే జొన్న రైతులు అప్పులపాలు కావటమేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మినుములు, పెసలకూ మద్దతు ధర నిర్ణయిస్తే అంతటి రేటు అందుతున్న పరిస్థితిలేదు. మినుములు క్వింటాకు రూ. 7,400, పెసలు క్వింటాకు రూ. 8,682 చొప్పున మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రాంతాలను బట్టి రేట్లలో వ్యత్యాసం ఉన్నా, మద్దతు ధరను అందుకున్న పరిస్థితిలేదు. వీటిపై కూడా దృష్టిపెట్టాలనేది రైతుల విన్నపం. ఏదిఏమైనా జొన్న వంటి తక్కువ విస్తీర్ణంలో సాగయిన పంటలకయినా మద్దతు ధరకు దగ్గరగా కొనుగోలు చేయగలిగితే రైతులు గట్టెక్కినట్టే. పౌరసరఫరాల శాఖ దీనిపై నిబంధనల ప్రకారం కాకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది.



మొక్కజొన్నలు రేటు ఆశాజనకంగా ఉండటంతో చేలల్లోనే లారీలకెత్తేస్తున్న రైతులు

కొలిక్కి వస్తున్న.. రీ సర్వే

(5వ పేజీ తరువాయి)

రాగా, ఒక్క బాపట్ల జిల్లలోనే 4,115 వినతులు వచ్చాయి. వీటిలో దాదాపు 80 శాతం పరిష్కరించారు. మిగిలిన వాటి విషయంలో నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు రిఫర్ చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అదే విధంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9,500 అర్జీల్లో 75 శాతం ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిలో కసరత్తు జరుగుతతుందనేది రెవెన్యూ విభాగం మాటగా ఉంది

క్లిష్టతరం.....వైసీపీ నిర్వాకమే...

గ్రామ సభలతో పాటు రెవెన్యూ సదస్సులు, ఇప్పుడు ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే ఘట్టం ఇలా ప్రతి అంకంలోనూ గ్రామాల్లో సంక్లిష్టంగా ఉండే భూ వివాదాలు పదుల సంఖ్యలోనే వెలుగు చూస్తున్నాయి. వాటిపై ఓ నిర్ణయానికి రావడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీ సర్వే చేపట్టిన మూడు జిల్లాల గ్రామాల పరిధిలో దాదాపు 1050 సర్వే నెంబర్ల విషయంలో తుది నిర్ణయానికి రావడం అధికారులకు క్లిష్టంగా మారింది. వీటి పరిధిలో ఉన్న చిక్కులను పరిష్కరించడం యంత్రాంగానికి సవాల్‌గా మారిందది. దీనికి ప్రధాన కారణం వైసీపీ నేతలు అధికారం అండతో రికార్డులు తారుమారు చేసి మరీ భూములను చెరబట్టారు. అధికారికంగా లెక్కల్లో భూమి వారిపేరు మీద ఉంది కానీ బాధితులు మాత్రం పెద్దసంఖ్యలో కనబడుతున్నారు. కొంతమంది రెవెన్యూ సిబ్బంది అండతో అక్రమాలను సైతం పక్కాగా రెగ్యులరైజ్ చేయించుకునే తంతు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా నడిచింది. వీటి విషయంలో తుది నిర్ణయానికి వస్తే తప్ప గ్రామాల్లో భూ రికార్డులకు గాను ఫైనల్ ఆర్‌వోఆర్ ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఇలాంటి వాటిపై కూడా ఓవిధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రీ సర్వేని మమ అనిపించకుండా స దరు గ్రామాల్లో మళ్లీ భూ వివాదం అనే మాట వినపడడానికి వీల్లే దని, ఇదే సమయంలో బాధితుందరికీ న్యాయం జరగాల్సిందేనన్న పట్టుదలతో ప్రభుత్వం అడుగులేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

భర్త వేధింపుల తాళలేక.. భార్య ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంటున్న ఘటన మండలంలోని కంటెపూడిలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుంటగాని వేణు అలియాస్ వేమయ్యతో కట్టవారిపాలేనికి చెందిన శిరీషకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి వేణు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండేవాడు. ఆదివారం రాత్రి కూడా భార్య శిరీషతో వేణు గొడవ పడ్డాడు. అతని వేధింపులు తాళలేక శిరీష తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారాన్ని వేణు కుటుంబ సభ్యులు శిరీష తల్లిదండ్రులకు చేరవేశారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. శిరీషకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి చెరుకూరి నెహేమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు.

హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

వినుకొండటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొదటి స్థానం కైవసం చేసుకునేందుకు ఎడ్ల యజమానులు చివరి క్షణం వరకు శ్రమిస్తున్నారు. ఆరు పళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం, పంగులూరుకు చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివరామకృష్ణచౌదరి, చిలుకూరి నాగేశ్వరరావుకు చెందిన ఎడ్లు 5,448 అడుగులు లాగి మొదటి స్థానాన్ని కైసవం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకువీడుకు చెందిన సూరా పూజితరెడ్డికి చెందిన ఎడ్లు 4,720 అడుగులు లాగి రెండో బహుమతి, పల్నాడు జిల్లా దాచేపల్లి కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్యకు చెందిన ఎడ్లు 4581 అడుగులు లాగి 3వ బహుమతి, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లు 4,500 అడుగులు లాగి 4వ బహుమతి, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గంగన్నపాలేనికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మారెడ్డి (ఎంఎల్ఏ, కోదాడ), టీఎస్ అండ్ రాయుడు సుబ్బారావుకు చెందిన ఎడ్లు 4,250 అడుగులు 5వ బహుమతి, నాగరికర్నూల్ తెలకపల్లి మండలం పర్వతపురానికి చెందిన శ్యామలా చరణ్‌తేజ, టీఎస్ ఉప్పునూతల మండలం వెల్లటూరుకు చెందిన శివరామకృష్ణ ఎడ్లు 3,781 అడుగులు లాగి 6వ బహుమతి కైవసం చేసుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన యజమానులకు డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు, దూలం కోటిరెడ్డి, ఎస్. నారాయణరెడ్డి, నాగిరెడ్డి అంజిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామినేని మణికిరణ్, లిఖిత, సోమేపల్లి బ్రహ్మయ్య, బట్టు గోపి, జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి, అనుమోలు నాగాంజిరెడ్డి నగదు బహుమతి అందజేశారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన రైతులతో పాటు నిర్వాహకులకు, ఎడ్ల యజమానులకు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు దేవస్థాన ఆవరణలో నిత్యం అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి, చప్పిడి రామారావు, పోకా సుబ్బారావు, నాగులపాటి గుర్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ఆరు పళ్ల విభాగంలో మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుల డిమాండ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండిన బర్లీ పొగాకును కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా క్వింటా రూ.18 వేలు ధర చెల్లించి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం గుంటూరులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది క్వింటా రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లోని మూడు లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పొగాకులో గణనీయమైన సంఖ్యలో బర్లీ పొగాకు ఉందని తెలిపారు. ఎకరానికి రూ.1.65 లక్షల పెట్టుబడి రైతులు పెట్టారని పంట మార్కెట్‌కు వచ్చే సమయానికి ప్రోత్సహించిన కంపెనీలు మొహం చాటేసాయని ఆరోపించారు. నల్లమడ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ వైట్ బర్లీ, నల్ల బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసే విధంగా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమితి నాయకులు పి.జమలయ్య, మ రెడ్డి వెంకటరెడ్డి, తోట ఆంజనేయులు, మన్నవ హరిప్రసాద్, జి.ఈశ్వ రయ్య మాట్లాడుతూ తక్షణమే పొగాకు పండించే ప్రాంతాల్లో సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. 25వ తేదీలోపు సదస్సులు జరిపి ఉద్యమానికి సన్నద్ధం చేయాలని, 30లోపు ప్రజా ప్రతినిధులు విన తి పత్రాలు అందజేయాలని, మే 5న చలో ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకుని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించా రు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు వి.కృష్ణయ్య, వై. రాధాకృష్ణ, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్, పాల్గొన్న కొల్లా రాజమోహన్ తదితరులు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 514.70 అడుగులు ఉంది. ఇది 139.78 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,42,976 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,49,133 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,42,976 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,568 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13400
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10000	13200	బ్యాడిగి 5531	--	--
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	--	--	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

విశ్రాంత ఉద్యోగుల గగ్గోలు

● మూడో వారంలోనూ పింఛన్ చెల్లించని ఏఎన్‌యూ

పెదకాకాని, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏ ఎన్‌యూ) రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ కోసం మూడు వారాలుగా ఎదురుచూస్తు న్నారు. 2, 3 తేదీల్లో చెల్లించాల్సి పెన్షన్ ఇంతవరకు అందుకపోవడంతో వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోవ డంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. విశ్వవిద్యాలయంలో సుమారు 700 మంది పెన్షనర్లకు నెలకు రూ.2.3 కోట్లు చెల్లించాలి ఉంది. ఇప్పటి వరకు ఆ మొత్తాన్ని విడుదల చేయకపోవడంతో వారంతా ఆర్థిక సతమతం అవుతున్నారు. పెన్షన్ చెల్లింపులో ఆలస్యం కారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారిందని పె న్షనర్లు వాపోతున్నారు. విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగులపై వర్సిటీ ఉన్నతాధి కారులు నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారు. దీంతో వర్సిటీ ఉన్నతాధికారుల చుట్టూ తిరు గుతూ తమ పెన్షన్ ఇప్పించాలని విశ్రాంత ఉద్యోగులు వేడుకుంటున్నారు. దీనిపై పెన్షన్ దారులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాలని యోచిస్తున్నారు. దీనిపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం వివరణిచ్చారు. పెన్షన్ కి సంబంధించి బ్లాక్ గ్రాంట్ రాలేదని ఆయన తెలిపారు. గ్రాంట్ అనుమతి రాగానే చెల్లింపులు చేపడతామని సమాధానం ఇచ్చారు.

టీడీపీ సానుభూతిపరుడిపై హత్యాయత్నం

నకరికల్లు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో వైసీపీ అరాచకం పెచ్చుమీరింది. బాలికను వేధిం చొద్దని మందలించినందుకు.. ఆమె ఇంటిపై యువకుల తరపున వైసీపీ గూండాలు దాడి చేశారు. బాలిక తాతయ్యపై హత్యాయత్నం చేసి, ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఓ బాలికను కొన్ని రోజులుగా ఇద్దరు యువకులు వేధిస్తున్నారు. ఆదివారం మండలంలోని కుంకలగుంట గ్రామంలో నిదానంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారి తిరునాళ్లకు వెళ్లిన ఆ బాలికను యువకులు బైక్‌తో చెక్కర్లు కొండుతూ తీవ్ర వేధింపులకు గురిచేశారు. ఈ విషయం బాలిక కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపింది. సంబంధిత యువకులను వారు హెచ్చరించారు. సోమవారం కూడా ఇలాగే వ్యవహరించటంతో ఆ యువకులను మందలించారు. దీనికి ఆగ్రహించిన ఆ యువకుల తరుపున వైసీపీ గూండాలు ఆ బాలిక తాతయ్య ఇంట్లో నిద్రిస్తుండగా బండ తీసుకొని తలపై మోది హత్యాయత్నానికి పాల్పడ్డారు. కాళ్లతో, చేతులతో, కర్రలతో దాడి చేశారు. ఇంట్లోని వస్తువులన్నీ పగల గొట్టారు. బీరువాలో ఉన్న బంగారం, నగదును అపహరించుకుపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఉప్పలపాటి సుబ్బయ్యను చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చేత బడి చేస్తుందనే భయంతో పక్కింటి మహిళను కత్తితో నరికి చంపడమే కాకుండా.. అడ్డు వచ్చిన ఆమె సోద రిని కూడా కత్తితో పొడిచి చంపాలని ప్రయ త్నించి నట్టు నేరం రుజువు కావడంతో తుళ్లూరులోని కొత్తూ రుకు చెందిన షేక్ నాగుల్ మీరావలికి జీవిత ఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ గుంటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజు సోమవారం తీర్పు చెప్పారు. వివరాల మేరకు.. మృతురాలు లాల్ బీకి ఇంటి పక్కనే నివసించే షేక్ నాగుల్ మీరావలికి మధ్య స్థల వివాదం ఉంది. మంగళగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వీరి మధ్య సివిల్ దావా కూడా నడుస్తోం ది. ఈ నేపథ్యంలో లాల్ బీ రాత్రిపూట తన ఇంటి ముందు మంట వేసి, జుట్టు విరబోసుకుని దాని చు ట్టూ తిరుగుతూ పెద్దగా అరుస్తూ ఉండటం నాగు ల్ మీరావాలి గమనించాడు. ఓసారి ఆమెను చెంపపై కొట్టి మందలించాడు. అయినా ఆమె తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో ఆమె మంత్రగత్తె అని, స్థల వివాదం నేపథ్యంలో తనపై చేతబడి చేస్తుందని భావిం చాడు. చేతబడి చేయవద్దని ఆమెను వేడుకొన్నాడు. ప క్కనే ఉండే తన ఇంటిని ఖాళీ చేసి.. వేరే ఇంటికి మా రాడు అయినా అతనిలో భయం పోలేదు. 2017 మార్చి 2న రాత్రి లాల్ బీ తన తండ్రి మౌలాలి సాహెబ్, సోదరి రాజంబీతో కలిసి ఇంట్లో ఉండగా నిందితుడు నాగుల్ మీరావలి కత్తితో వచ్చి ఆమెను మెడ నరికి చంపాడు. అడ్డువచ్చిన సోదరి రాజంబీని కూడా కత్తితో మెడపై పొడిచాడు. చుట్టుపక్కల వారు కేకలు వేయ డంతో పరారయ్యాడు. లాల్‌బీ అక్కడే మృతిచెందగా రాజంబీ ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంటోంది. ఈ సంఘటనపై లాల్ బీ తండ్రి మౌలాలి సాహెబ్ ఫి ర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు నిందితుడు నాగు ల్ మీరావలిపై హత్య హత్యయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ సుధాకర్ రావు కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అడిష నల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ అలీ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. మీరావలిపై హత్యాహత్యాయత్నం నేరాలు రుజువు కావడంతో.. జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పులిచిం తల ప్రాజెక్టులో సోమవారం 28.68 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



జీజీహెచ్‌లో కుక్కకాటు బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరులో మరోసారి వీధి కుక్కల స్వైరవిహారం

- సుమారు 25 మందికి గాయాలు
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులు
- పరామర్శించిన పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలో వీధి కుక్కలు మరోసారి రెచ్చిపోయాయి. స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీ అగ్రహారం 11/4 లోని శివరామనగర్ మెయిన్ రోడ్డుపై సోమవారం రాత్రి కుక్కల గుంపులు రెచ్చిపోయాయి. ఓ పిచ్చి కుక్కతో పాటు దానికి తోడైన మరో నాలుగు కుక్కలు కలిసి ఆ ప్రాంతంలో కనిపించిన వారిని కనిపించినట్లు మీద పడి కరిచాయి. అందులో చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు సుమారు 25 మంది కుక్కల కాటుకు బలయ్యారు. ఐదు కుక్కల గుంపులో ఒకటి పిచ్చికుక్క ఉండడంతో స్థానికులు కర్రలతో వెంటబడి దానిని చంపేశారు. గాయపడిన వారిని హుటాహుటిన గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాధితులను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి నగరంపాలెం సీఐ నజీర్ అహ్మద్‌తో కలిసి పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిలో ఎన్.సుధారాణి (45), డి.భాస్కరరావు (30), కె.శ్రీనివాసరావు (54), హెచ్ మోరబోయినా (10), ఎం శ్రావణి (33), వి.గోపి (28), షేక్ బాషి (14), ఎం సాయి ఈశ్వర్ (18), కె.ప్రసాద్ (9), ఎన్ పెద్దవరరాజు(20), అరవింద్ (18), హర్షవర్ధన్ (12), నాగమ్మ (50), సుజాత (30), అభినవ్ (12)లతోపాటు మరికొందరు ఉన్నారు.

ఈనెల 6న శ్రీరామనవమి పర్వదినం రోజునే నల్లపాడు పోలీస్ స్టేషన్కు కూతవేటు దూరంలో ఉన్న స్వర్ణభారతినగర్ శివారు ఐద్వానగర్‌కు చెందిన కొమ్మగాని నాగరాజు, రాణి దంపతుల నాలుగేళ్ల కుమారుడు ఐజాక్‌ను ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క గొంతు కొరికి చంపేసింది. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కందుల దుర్గేష్‌తోపాటు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జిల్లా టీడీపీ నాయకులతోపాటు సీఎంవో కార్యాలయం స్పందించింది. సీఎంవో ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అధికారులు బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించారు. ఈ ఘటన జరిగిన సమయంలో నగరపాలక సంస్థ అధికారులు హడావుడి చేసినప్పటికీ ఆ తరువాత గుంటూరు నగరంలో వీధి కుక్కల గురించి స్పందించలేదు.



హజ్ యాత్రికులకు వాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ సలహాదారు ఎండీ షరీఫ్

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులకు వాక్సినేషన్ తప్పనిసరి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని స్టార్ కన్వెన్షన్ హాల్లో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు షరీఫ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. హజ్ యాత్రికుల కోసం ఆయన ఆయన భోజన వసతి కల్పించారు. అనంతరం యాత్రికులతో కొద్ది సేపు మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లే వారు కొన్ని నిర్దిష్టమైన వ్యాక్సిన్‌లు తీసుకోవడం తప్పనిసరని చెప్పారు. వాటిలో మెనింజైటిస్, పోలియో, ఇన్‌ఫ్లూయేంజా వంటి టీకాలు అవసరమని వివరించారు. సౌదీ అరేబియా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ టీకాలు వేయించు కోవాలని ఆయన వివరించారు. రాష్ట్రంలో హజ్ యాత్రికుల సదుపాయాల కోసం అసెంబ్లీ వేదికగా ప్రస్తావించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు షరీఫ్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లేవారు ఎల్లప్పుడూ తాజా సమాచారం కోసం హజ్ కమిటీ, సంబంధిత ప్రభుత్వ అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. హజ్ యాత్ర చేయడమంటే దేవుని ఆశీర్వాదం పొందినట్టేనని ఆయన అన్నారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజా సమస్యలను వింటున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21(ఆంధ్ర జ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో వస్తున్న అర్జీల్లోని ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పీజీ ఆర్ఎస్ నిర్వ హించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 15 ఫిర్యాదులు అందుకొని, మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాల న్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్‌లు హాజరైన పీజీఆర్ఎస్ కార్య క్రమానికి 37 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి అందిన అర్జీలను విభాగాల వారీగా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మల్లేశ్వర రావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాషా, విభాగాల సూపరింటెండెంట్లు, ఎస్ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు కార్మికులు అవసరం

రోజువారి వేతనంపై ఆసక్తి గలవారు కాల్ సెంటర్లో సంప్రదించాలి

గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు చేయడానికి రోజువారీ వేతనం పై కార్మికులు అవసరమని, ఆసక్తి కల్గిన వారు గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్లో నేరుగా లేదా 08632345103 కి కాల్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల తనిఖీ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరుగుచున్న ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజ న పనులను తనిఖీ చేసేందుకు నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ ఏజెన్సీకి చెందిన నేషనల్ క్వాలిటీ మానిటర్ బినయ్ కుమార్ సిన్హా జిల్లాకు వచ్చినట్లు పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య తెలిపారు. ఈ నెల 25 తేదీ వరకు ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నారన్నారు. మంగళవారం గుంటూరు నుంచి బయలుదేరి వట్టిచెరుకూరు, లేమల్లెపాడు, కాకుమాను లో బాపట్ల-పెదనందిపాడు ఆర్ అండ్ బీ రోడ్ తనిఖీ చేస్తారని తెలిపారు. 23న గుంటూరు నుంచి బయలుదేరి మామిళ్ళపల్లి-కట్టెంపూడి జీబీసీఆర్‌బీ రోడ్‌ను తనిఖీ చేసి పొన్నూరు చేరుకుంటారని అన్నారు. 24న గుంటూరు నుంచి బయలుదేరి నారాకోడూరు, లేమల్లెపాడులో పూర్తయిన పనులను పరిశీలిస్తారని తెలిపారు. 25వ తేదీన గుంటూరు నుంచి బయలుదేరి ఫిరంగిపురంలో గుంటూరు-నరసరావుపేట ఆర్అండ్‌బీ రోడ్డు, మేడికొం డూరు-చేమవరం, 113-తాళ్ళూరు పనుల పురోగతిని పరిశీలించి గుం టూరు చేరుకుంటారని పంచాయతీరాజ్ ఈఈ జి.బ్రహ్మయ్య తెలిపారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

- డీఆర్వో షేక్ ఖాజావలీ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 290 అర్జీలు
- పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని అధికారులను డీఆర్వో షేక్ ఖాజావలీ ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 290 అర్జీలు వచ్చాయి. కలె క్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో స్టెప్ సీఈవో చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, డీపీవో సాయికుమార్, డ్వామా పీడీ శంకర్‌తో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. ఖాజావలీ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఈవో రేణుక, డీఎస్‌వో కోమలి పద్మ, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు పాల్గొన్నారు.

- ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఇంటర్మీడియట్ విద్యా పెన్షనర్ల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నారాయణరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అంజయ్య, సభ్యులు హనుమంతరావు, ఎస్.సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.
- స్థానిక శారదా కాలనీ, 16వ లైన్లో నివాసాల మధ్య ఎటువంటి అనుమతులు లేకుండా, అక్రమంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ స్థానికులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు చెప్పినా వినకుండా చర్చి నిర్మాణం చేపట్టారని, దీంతో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా మని అన్నారు. ఫిర్యాదు చేసినందుకు మాపై కొంత మంది దాడులకు పాల్పడ్డారని, అదేమని అడిగితే మీపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు. పసుపులేటి రోహిణీ, పద్మనాభం, సునీత తదితరులు ఉన్నారు.
- సీఎఫ్ఎంఎస్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో ఎనిమిది నెలల నుంచి జీతాలు రావడం లేదని 5 గ్రేడ్ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు వాపోయారు. జీతాలను విడుదల చేయాలంటూ డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జాల్లాదికుమార్, గాయత్రి, సైదులు, సౌజన్య తదితరులు ఉన్నారు.
- పాతగుంటూరు, మణీహోటల్ సెంటర్లో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ స్థానికులు వినతిపత్రం అందజేశారు. దేవాలయాలు, పాఠశాలలు, నివాస గృహాలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఈ దుకాణం ఏర్పాటు చేయడం సరైనది కాదన్నారు. ఈ దుకాణానికి అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానికులు పద్మ, సునీత తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మా ట్లాడుతున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జేడీ శిరీష

కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు చేయనున్న కిశోరి వికాసం కార్యక్రమంపై గుంటూరు జడ్పీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోరి బాల లకు ప్రత్యేకమైన కాలెండర్‌ను రూపొందించి వివిధ కార్యక్రమాలు అమలు చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలలోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలు, రుతుక్రమ శుభ్రత, బాలల హక్కులు, పోషణ, ఆరోగ్యం, లింగ సమానత్వం, విద్య ఆవశ్యకత, నైపుణ్యాభివృద్ధి, ఉపాది అవకాశాలు అంశముల గురించి చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్లు ఎం శిరీష, బి.మనోరంజని, ప్రాంతీయ ఉప సంచాలకులు ఎస్ జయలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ప్రోగ్రామ్ మేనేజర్లు పాల్గొన్నారు

విద్యతోనే మానవ వికాసం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మనిషిని అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు నడిపించే విద్య ప్రపంచ చరిత్ర గతిని మార్చి వేస్తుందని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ అన్నారు. స్థానిక బాలానంద కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తు న్న బ్రాడీపేట, కృష్ణనగర్ లోటస్ ఆద్యా పాఠశాల వార్షిక వేడుకలు 'ఆద్యాస్ కార్నివాలి' పేరుతో పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని ఏకాగ్రత, కఠోరశ్రమతో సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధా కృష్ణమూర్తి వివిధ అంశాలలో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు అతిథులచే ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి నడింపల్లి వెంకట గురుదత్, సహాయ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు, కరస్పాండెంట్ పరుచూరి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, కేతరాజు రామ్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ పూర్వ విద్యార్థి రూ.10 లక్షల విరాళం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, ఎన్నారై డాక్టర్ చిర్రావూరి వీరభద్రయ్య వైద్య కళాశాల గ్రంథాలయం అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. జీఎంసీ 1972వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ వీరభద్రయ్య అమెరికాలోని కెంటకీలో వైద్యుడుగా స్థిరపడ్డారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ పిలుపు మేరకు స్పందించిన ఆయన కాలేజీ లైబ్రరీలో ఐరన్ రూఫ్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. ఇందులో భాగగా తొలి విడతగా రూ.5 లక్షలు అందజేశారు.

సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలి

- మంత్రికి సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గత 6, 7 నెలలుగా అపరిష్కృతంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రజాక్ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర, విధానపరమైన, హేతుబద్ధీకరణ అంశాల సమస్యల వల్ల ఎంతో ఒత్తిడికి గురి అవుతున్నా మని చెప్పారు. విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రమోషన్‌లకు సంబంధించిన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారని రజాక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి శిష్టు నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పార్థా మధు పాల్గొన్నారు.

కళాకారులతోనే ప్రజా చైతన్యం : జంగాల

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో పెరిగిపోతున్న అజ్ఞానం తొలగిపోవాలంటే కళాకారులు ప్రజా చైతన్యానికి పాటుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి సమావేశం చంద్రనాయక్ అధ్యక్షతన నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం అజ్ఞానం మూఢ విశ్వాసాలు పెరిగిపోవడంతో సమాజానికి తీరని నష్టం కలుగుతుందని అన్నారు. సమావేశంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చంద్రనాయక్, చెన్నం పెంచలయ్యలు రామకృష్ణ, ఆర్.పిచ్చయ్య, మహంతి లక్ష్మణరావు, ఆరే రామారావు, వీ.నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడి రాకను వ్యతిరేకించాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవ్యాన్స్ భారతదేశ పర్యటనను వ్యతిరేకాస్తూ స్థానిక కొత్తపేట, భగత్ సింగ్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జేడీవ్యాన్స్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రైతులకు నష్టం చేసే ఎటువంటి ఒప్పందాల్ని అమెరికాతో చేసుకోరాదని హెచ్చరించారు. ఆయన రాకను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వ హించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

చర్చలతోనే సమస్యల పరిష్కారం : యేల్చూరి

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కార్మికులకు, యాజమాన్యాలకు సమస్య వచ్చినప్పుడు చర్చలతోనే పరిష్కారమవుతుందని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏఐటీయూసీ ప్రతినిధి బృందం యేల్చూరిని సోమవారం కలుసుకున్నారు. యేల్చూరి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే అన్నివర్గాల ప్రజలు కలిసి పని చేయాలని కోరారు. ఇటీవల చాంబర్ ఎన్నికల్లో యేల్చూరి గెలుపొందటంపై శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హమాలీ ముఠా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడ చల్లా చిన్న ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగం గా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ బీ.రాజమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. చాకలిగుంట, లాం చెస్టర్ రోడ్డు, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం లైను, ఆర్ అగ్రహారం, బైపాస్‌రోడ్డు, నల్లచెరువు, మూడు బొమ్మల సెంటర్, ఏటుకూ రు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అలానే మంగళదాస్‌నగర్, కబర్దీనగర్, నవ భారత్‌నగర్, ఇజ్రాయిల్‌పేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ హుస్సేన్‌ఖాన్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

రైల్వే క్రూ లాబీలో సీనియర్ డీఎంఈ, డీసీఎం విస్తృత తనిఖీలు


గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేష న్‌లోని నాల్గో నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న కంబైన్డ్ క్రూ లాబీని సీనియర్ డీఎంఈ మద్దాళి రవికిరణ్, డీసీఎం కమలాకర్‌బాబు విస్తృతంగా తనిఖీ చేశారు. రైల్వేబోర్డు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇరువురు అధికారులు సోమవారం అన్నింటిని పరిశీలించారు. విధులకు హాజరౌతున్న సిబ్బంది నిబంధనల ప్రకారం తగిన విశ్రాంతి తీసుకొన్నారా, లేదా అనేది రిజిష్టర్‌లో పరిశీలించారు. డ్యూటీకి ఎక్కేముందు కచ్చితంగా బ్రీత్ ఎనలై జర్ పరీక్ష చేస్తామన్నారు. డ్యూటీకి ఎక్కిన తర్వాత సిబ్బంది నడవడికని ప్రతిక్షణం గమనించడం జరుగుతుందన్నారు. కేబిన్‌లో అమర్చిన సీసీ టీవీల నుంచి సేకరించిన ఫుటేజ్‌ని విశ్లేషిస్తామన్నారు. 272 లోకో పైలెట్లు, 132 మంది ట్రైన్ మేనేజర్లు నిత్యం విధులకు హాజరౌతున్నారని తెలిపారు. కాగా డివిజన్‌లో మొత్తం 290 ప్రాంతాల్లో పశువులు రైల్వేట్రాక్‌ల పైకి రావడం వంటివి గుర్తించామని, త్వరలో డివిజన్ అంతటా బ్యారికేడింగ్ చేయడం జరుగుతుందన్నారు. అలానే ఎవరైనా ప్రయాణీకుడు అలారం చైన్‌ని లాగితే అందుకు గల కారణాలను కూడా రిజిష్టర్‌లో ఎంట్రీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎం కే.కమలాకర్‌బాబు, ఏడీఎంఈ బాపయ్య, గజిటెడ్ ఎస్ఎస్ రవిరాజ్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



రైల్వే క్రూ లాబీలో తనిఖీలు నిర్వహిస్తున్న సీనియర్ డీఎంఈ మద్దాళి రవికిరణ్, డీసీఎం కమలాకర్‌బాబు

కన్నా పాఠశాలలో ఘనంగా 'కిడ్స్ ఫెస్టివల్ 2025'

గుంటూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైలుపేట కన్నా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో 2025 సంవత్సరాలకు వీడ్కోలు పలుకుతూ పిల్లల పండుగ (కిడ్స్ ఫెస్టివల్- 2025) ఘనంగా నిర్వ హించారు. సోదర భావంతో ఎదగాలని, జాతీయ స్ఫూర్తి కలిగి ఉండాలని, పెద్దలను, మహిళలను గౌరవించాలని, అవినీతి రహితంగా జీవించాలని, తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, మౌన ప్రదర్శనలు, స్కిట్స్, లఘు నాటికలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులను విశేషంగా ఆకర్షించాయి. కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకులు కన్నా మాస్టర్ మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా విద్యా బోధనతో సమానంగా విద్యార్థుల జీవన ప్రమాణాల మెరుగుదలకు కావలసిన నైపుణ్యాలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ రాజేశ్వరీదేవి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, కన్నా మాస్టారు

24న చలమయ్య కళాశాలలో మెగా జాబ్‌మేళా

గుంటూరు (విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న జీసీకేవీఎన్ డిగ్రీ కాలేజీ, మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో 'మెగా జాబ్ మేళా' నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో బహుళజాతి సంస్థలు, ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్ ఫైనాన్స్, ఫార్మసీకి సంబంధించిన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళీ శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ నుంచి పీజీ వరకు అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.



జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని, కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మేయర్ తదితరులు

పారిశుధ్య పనులకు కార్యాచరణ

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టేలా నగర కమిషనర్ నేతృత్వంలో పటిష్ట కార్యాచరణ మేరకు కృషి జరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగానికి అవసరమైన 6 ట్రాక్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీలా, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవిలతో కలిసి ప్రారంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనుల్లో మెరుగుదల కోసం గతంలో ఉన్న 22 శానిటరీ డివిజన్లను పర్యవేక్షణ సౌలభ్యం కోసం కమిషనర్ 32 డివిజన్లుగా పెంచారన్నారు. ఆయా డివిజన్లలో చెత్త సేకరణ చేయడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 27 ట్రాక్టర్లకు తోడుగా మరో 6 ట్రాక్టర్లను కొనుగోలు చేసి ప్రజారోగ్య విభాగానికి అందించారన్నారు. స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ గుంటూరు సాధనకు నగర ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.



తోపుడు బండ్లు అందజేస్తున్న మోహనకృష్ణ, ఎమ్మెల్యే మాధవి, కోవెలమూడి రవీంద్ర

ప్రగతికి వారధి సీఎం చంద్రబాబు : మన్నవ

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రగతికి వారధి, సంక్షేమానికి సారథి అని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ కొనియాడారు. సీఎం చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన గుంటూరులో 75 తోపుడుబండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్లా మాధవి, జోన్ 5 ఇన్‌చార్జి కోవెలముడి రవీంద్ర(నాని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజకీయ చరిత్రకు వన్నె తెచ్చిన పాలనతో సమసమాజ భావనలతో కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చే అధినేత చంద్రబాబు అని కొనియాడారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా పేదలకు స్వయం ఉపాధి కల్పించే చిరు సాయం అందించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

శాంతిభద్రతలు కాపాడటంలో రాజీపడొద్దు

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ఎమ్మెల్యే మాధవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ ఆరోగ్యరాజు

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడటంలో రాజీపడొద్దని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. అరండల్‌పేట సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆరోగ్యరాజు సోమవారం గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధి నియోజకవర్గానికి అత్యంత కీలకమని, శాంతి భద్రతలు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల భద్రతే ముఖ్యమని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సున్నితంగా వ్యవహరిస్తూ, ఫ్రెండ్లీ పోలీసు అనిపించుకోవాలని సూచించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈ నెలలో ఇరవై రోజులు గడుస్తున్నా కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు అందలేదని ప్రభుత్వ ఉద్యోగు ల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. మెడికల్ కళా శాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. వేతనాలు అందక ఉద్యోగ కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందు లు పడుతున్నాయని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదిన కాంట్రాక్టు, రెగ్యులర్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేలా చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరా రు. సమావేశంలో లక్ష్మీనారాయణ, విజయబాబు, ప్రసాదరావు, పెదరత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిఫరెన్షియల్, స్పెషల్ కేటగిరి ఉపాధ్యాయుల మెడికల్ క్యాంపు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆదే శాల ప్రకారం బదిలీ సమయంలో ప్రిఫరెన్షియల్, స్పెషల్ కేటగిరిలో పా యింట్స్ పొందాలనుకునే వారు ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరానికి హాజరుకావాలని డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆయా సమస్యలున్న వారు నిర్దేశించిన తేదీల్లో మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని సూచించారు.

పోలీస్ సిబ్బందికి ఎస్పీ నగదు రివార్డులు

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో విశేష కృషి చేసిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ సతీష్ కుమార్ నగదు రివార్డులు ప్రకటించారు. జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు రాష్ట్ర హోంశాఖ మంత్రి జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన పోలీస్ సిబ్బందికి నగదు రివార్డులు అందజేసారు. ఏఆర్ ఏఎస్సై నుండి పొరుగు సేవల సిబ్బంది వరకు 19 మందికి నగదు రివార్డులు అందజేసారు. తమను ఎస్పీ గుర్తించి నగదు రివార్డులు అందచేయడం ఎంతో సంతోషంగా ఉందని ఔట్ సోర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేసారు. రివార్డులు అందుకున్న వారిలో షేక్.ఎస్ బుడే, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్ళు పి. మురళి బాబు, వై.శ్రీనివాసరావు, ఏఆర్ కానిస్టేబుళ్లు డి.గోపి, జి.శివశేఖర్, హోంగార్డులు రమణ, బి.సుధీర్ బాబు, వై.ప్రేమ్ కుమార్, షేక్ మీరాబీ, పొరుగు సేవల ఉద్యోగులు సాయి కృష్ణ, నాగరాజు, రాజయ్య, ఏసు మరియమ్మ, కామేశ్వరరావు, విజయ, సుజాత, కృష్ణవేణి, మస్తాన్ బి, మల్లేశ్వరి ఉన్నారు.



సిబ్బందికి నగదు రివార్డులు అందిస్తున్న పోలీసు అధికారులు

సంక్షోభంలో.. నాపరాయి క్వారీలు



గోలిలోని నాపరాయి క్వారీ



గ్రానైట్ రాకతో ఆదరణ కోల్పోయిన పరిస్థితి

ఉపాధి కోల్పోతున్న కార్మికులు

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడులోని రెంటచింతల, గోలి, తుమ్మకోట, మల్లవరం, పశర్లపాడు, జెట్టిపాలెం, మాచర్ల, రాయవరం, మండాది, రచ్చమలపాడు, శ్రీరాంపురంతండా, బోదలవీడు గ్రామాల పరిధిలో నాపరాయి క్వారీలకు ప్రసిద్ధి. ఎంతో మందికి ఉపాధిని కల్పించిన ఈ నాపరాయి క్వారీలు కాలక్రమంలో ఆదరణ కోల్పోయాయి. ఈ క్వారీల వలన లారీ ట్రాన్స్‌పోర్టు, కూలీలకు మంచి ఉపాధి లభించేది. పల్నాడులో ఒకప్పుడు అత్యంత ఉపాధి కల్పించిన ఈ నాపరాయి క్వారీలు నేడు గ్రానైట్, యుత్రిఫైడ్ టైల్స్ వాల్ పేపర్లు రాకతో పూర్తిగా మరుగున పడిపోయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో దానిపై ఆధారపడి జీవించే డ్రైవర్లు, ఓనర్లు, కూలీలు దీన స్థితిలోకి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది.





గ్రానైట్స్ రాకతో...

మొదట్లో రాళ్లను చేతులతో తొలిచి మొలలు ద్వారా రాళ్లను చిన్నసైజు చేసేవారు. నాపరాయి పరిశ్రమ నుంచి రవాణాకు ఎద్దుల బండ్లను కూడా వాడేవారు. కాలక్రమేణా లారీలు, ట్రాక్టర్లు రావడంతో రాళ్లను సులభతరంగా తీసి రవాణా చేస్తున్నారు. నిత్యం నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్‌తో మూడు పూలు, ఆరు కాయలుగా పరిశ్రమ అభివృద్ధి చెందింది. కానీ నేడు ఆ పరిస్థితి భిన్నంగా ఉంది. వ్యాపారాలు లేక పరిశ్రమలు మూతపడుతున్నాయని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు. వారం వచ్చిందంటే చాలు కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం గ్రానైట్, టైల్స్ వ్యాపారం అధికంగా ఉండడంతో నాపరాయి పరిశ్రమకు గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. వ్యాపారాలు సన్నగిల్లడంతో యజమానులు, కూలీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణంలో నాపరాయిని వినియోగిస్తే తమకు మేలు జరుగుతుందని వ్యాపారస్తులు, కూలీలు పేర్కొంటున్నారు.

దాతృత్వానికి తిలోదకాలు

● మూతపడ్డ చావలి ఆయుర్వేద ఆసుపత్రి ● దెబ్బతింటున్న భవనం, రికార్డులు... సామగ్రి

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దాతల దాతృత్వానికి తిలోదకాలు ఇస్తున్నారు అనడానికి చావలి ప్రభుత్వ వైద్యశాల భవనమే తార్కాణం. గ్రామంలో రెండేళ్ల క్రితం మూతపడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను తిరిగి ప్రారంభించేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై దృష్టి పెట్టడం లేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలచి శ్లాబ్, గోడలు దెబ్బతింటున్నాయి. ఆసుపత్రి లోపల ఉన్న రికార్డులు, సామగ్రి పాడైపోతున్నాయి. 1982లో ఆయుర్వేద వైద్యశాల నిర్మాణం కోసం గ్రామానికి చెందిన గాజుల మహాలక్ష్మమ్మ అమర్తలూరు పంచాయతీ సమితి ద్వారా స్థలాన్ని దానంగా ఇచ్చారు. నాటి హోంశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1985లో అప్పటి జెడ్పీ చైర్మన్ సక్కుర్తి రామయ్య వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. నాటి నుండి ప్రభుత్వ పర్యవేక్షణలో గ్రామస్తులకే కాకుండా చుట్టు పక్కల గ్రామాల వారికి ఆయుర్వేద వైద్య సేవలు 2022 వరకు అందాయి.

వైద్యశాలకు ప్రజాదరణ

ప్రతిరోజు రోగుల సంఖ్య 100కు పైగానే ఉండేది. దానికి తగ్గట్టుగానే ఆసుపత్రి సేవలను గుర్తించిన ప్రభుత్వం మందులను కూడా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తూ ఉండేది. 2022లో ఇక్కడ పని చేసే సిబ్బందిని బదిలీ చేశారు. ఆ తర్వాత నియామకం జరగలేదు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఆయుష్ విభాగంలోని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కొనసాగినంత వరకు సేవలు పొందారు. ఇక్కడ పని చేసిన వైద్యులకు ప్రజాదరణతో పాటుగా ప్రభుత్వం నుంచి అవార్డులు కూడా అందాయి. ప్రస్తుత వైద్యశాల దుస్థితిని చూసి గ్రామస్తులు దాతల ఆశయాన్ని ప్రభుత్వం నీరుగారుస్తుందని, ఆయుర్వేద వైద్య సేవలు తమకు దూరం చేశారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు భవన నిర్మాణం మరమ్మతులు చేయించడంతో పాటు తక్షణమే ఆయుర్వేద వైద్యుడు, తగిన సిబ్బందిని నియమించి పూర్వ వైభవాన్ని తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆయుర్వేద ఆసుపత్రి భవనంపై మొలచిన పిచ్చి మొక్కలు



చావలిలో మూతపడ్డ ఆయుర్వేద ఆసుపత్రి



కమిషనర్ నరసింహారెడ్డిని జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తున్న నూతన కమిషనర్ సుజిత్ మల్లిక్, అధికారులు

సీజీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి బదిలీ

● ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి బదిలీ అయ్యారు. రెండేళ్ల పాటు పనిచేసిన ఆయనను హైదరాబాద్‌లో అప్పీల్స్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కన్నావారి తోటలో ఉన్న సీజీఎస్‌టీ కార్యాలయంలో కమిషనర్ నరసింహారెడ్డి వీడ్కోలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ఉద్యోగులు అందించిన సమష్టి సహకారంతోనే రెవెన్యూ పరంగా సెంట్రల్ జీఎస్టీ శాఖను అగ్రస్థానంలో నిలబెట్టగలిగానని ఆనందం వ్యక్తం చేశారు. తన ఉద్యోగ జీవితంలో గుంటూరు కమిషనరేట్‌తో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కమిషనర్ నరసింహారెడ్డి ఉద్యోగ బాధ్యతలతో పాటు, సేవా తత్పరునిగా సమాజానికి ఎంతో మేలు చేశారని కొనియాడారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం నాగరాజు, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి స్ఫూర్తి శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన అత్యంత అరుదైన ఐఆర్ఎస్ అధికారి నరసింహారెడ్డి అని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులు కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.రవికుమార్, సూపరింటెండెంట్లు నవీన్ రాజు, చిదెళ్ల ఈశ్వరరావు, చిట్టి వెంకటేశ్వరరావు, కాకర్ల శ్రీనివాస్, పూర్ణ సాయి పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌గా మల్లిక్, నేడు బాధ్యతల స్వీకారం

సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్‌గా సుజిత్ మల్లిక్‌ను నూతన కమిషనర్‌గా నియమించారు. భువనేశ్వర్‌లో సీజీఎస్‌టీ అడిషనల్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను ఉద్యోగోన్నతిపై గుంటూరు కమిషనర్‌గా బదిలీ చేశారు. మంగళవారం సీజీఎస్‌టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.


రైల్వే కంబైన్డ్ రన్నింగ్ రూం ఆధునికీకరణ

● రూ.3.74 కోట్లు విడుదల చేసిన రైల్వే శాఖ
● కొత్తగా మరో 11 విశాంత్రి గదుల నిర్మాణం
● అంతటా త్రీస్టార్ సదుపాయాల కల్పన

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే కంబైన్డ్ రన్నింగ్ రూం ఆధునికీకరణకు రైల్వేబోర్డు నిధులు మంజూరు చేసింది. ఇక్కడికి విశ్రాంతి కోసం సికింద్రాబాద్, రాజమండ్రి, విజయవాడ, రేణిగుంట, గుంతకల్లు, నంద్యాల నుంచి డ్యూటీపై వచ్చిన లోకో, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్‌లు వస్తున్నందున.. వారికి సకల సదుపాయాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశించింది. ఈ మేరకు తరచుగా రైల్వే అధికారులు రన్నింగ్ రూంని సందర్శిస్తూ అక్కడ లభిస్తున్న సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం 19 గదుల్లో 38 పడకలు ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసిన 11 గదుల్లో 22 బెడ్స్ అదనంగా రాబోతున్నాయి. దీంతో ఏకకాలంలో 60 మంది సిబ్బంది విశ్రాంతి తీసుకొనే అవకాశం ఏర్పడుతుంది. రైల్వే బోర్డు స్థాయిలో 2012లో, దక్షిణ మధ్య రైల్వే జోనల్ లెవల్‌లో 2024లో ఉత్తమ రన్నింగ్ రూం అవార్డు కూడా గుంటూరుకు దక్కడం విశేషం.

8 గంటల విశ్రాంతి తప్పనిసరి

రైళ్లలో విధులు నిర్వహించే ఎల్‌పీ, ఏఎల్‌పీ, టీఎంలకు సరైన విశ్రాంతి ఉంటేనే వాళ్లు సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తారని రైల్వేబోర్డు భావిస్తోంది. ఈ మేరకు ఎనిమిది గంటల కంటే ఎక్కువ సమయం డ్యూటీ నిర్వహించిన సిబ్బందికి గుంటూరు కంబైన్డ్ రన్నింగ్ రూంలో తగిన విశ్రాంతిని కల్పిస్తారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో దిగిన ఇతర డివిజన్ల సిబ్బంది మళ్లీ డ్యూటీ ఎక్కాలంటే కనీసం 8 గంటల విశ్రాంతి ఉండాలి. ఈ మేరకు రన్నింగ్ రూంలోని గదులన్నింటిని ఎయిర్ కండీషనింగ్ చేశారు. ఒక్కో గదిలో రెండు పడకలుండగా వాటికి దోమ తెరలను అమర్చారు. మహిళా సిబ్బందికి ప్రత్యేకించి రెండు గదులను కేటాయించి, వాటికే అటాచ్డ్ బాత్‌రూంలను ఏర్పాటు చేశారు. గీజర్, వాషింగ్ మెషిన్, ఐరన్ బాక్సు సదుపాయలను కూడా కూడా కల్పించారు. ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండేందుకు ఆటోమేటిక్ బ్యాకప్ జనరేటర్‌ని ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్‌ని కూడా వినియోగిస్తున్నారు.



కామన్ టాయ్‌లెట్స్



వెయిటింగ్ హాల్



లాబీ, ఆటోమేటిక్ బ్యాకప్ జనరేటర్

రీడింగ్ రూంలో దినపత్రికలు, పుస్తకాలు

లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు పుస్తకాలు, దిన పత్రికలు చదువుకునేందుకు ఒక రీడింగ్ రూమ్‌ని ఏర్పాటు చేశారు. అక్కడ తెలుగు, హిందీ, ఆంగ్ల దిన పత్రికలు, వీక్లీ మ్యాగజైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. అలానే పుస్తకాలు కూడా వారికి ఇస్తున్నారు. ధ్యానం చేసుకొనేందుకు ఒక మెడిటేషన్ హాల్‌ని కూడా ఏర్పాటు చేశారు.

హైజినిక్ కిచెన్, డైనింగ్ హాల్

కోచింగ్ సిబ్బందికి నాణ్యమైన ఆహారాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో వడ్డించేందుకు హైజినిక్ కిచెన్, డైనింగ్ హాల్‌ని ఏర్పాటు చేశారు. ఒకేసారి 12 మంది సిబ్బంది రౌండ్ టేబుల్ చుట్టూత కూర్చుని భోజనం చేయొచ్చు. బ్రాండెడ్ సరుకులనే ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్నారు. రోజుకొక మెనూని నిర్ణయించి, ఈ మేరకు ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. త్వరలో కిచెన్, డైనింగ్ హాల్స్‌ని కూడా ఎయిర్ కండీషనింగ్ చేయనున్నారు. పరిశుభ్రమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ని ఏర్పాటు చేశారు. అలానే తాగే నీరు చల్లగా ఉంచేందుకు కూలర్, వేడినీళ్లు కావాలనుకొనేవారికి ప్రత్యేక యంత్రం ఏర్పాటు చేశారు.

సీసీ టీవీలో పర్యవేక్షణ

రన్నింగ్ రూం అంతటా సీసీ టీవీలను అమర్చారు. గదుల్లో సిబ్బంది సక్రమంగా విశ్రాంతి తీసుకొంటున్నారా, ఏమైనా ఫోన్లు చూసుకొంటూ కాలం గడిపేస్తున్నారా అనేది కూడా పర్యవేక్షిస్తున్నారు. కారిడార్‌లో పిచ్చాపాటిగా తిరుగుతున్నారా అనేది కూడా చూస్తున్నారు. ఒకసారి లోనికి వచ్చిన తర్వాత ఎనిమిది గంటల విశ్రాంతి పూర్తి అయ్యేంత వరకు సిబ్బందిని బయటకు పంపించరు.

పరీక్షల అనంతరం అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం

రన్నింగ్ రూంలో పని చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకునే ముందు రైల్వే మెడికల్ ఆఫీసర్ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వాళ్లకు ఎలాంటి వ్యాధులు లేవని సర్టిఫికెట్ ఇస్తేనే విధుల్లోకి తీసుకొంటారు. అలానే ఎలాంటి నేర చరిత్ర లేదని పోలీసు శాఖ నుంచి ధ్రువీకరించుకొన్న తర్వాతే నియమిస్తారు.

విభజన కష్టాలు

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్) లిమిటెడ్ సంస్థలోని కొత్త సర్కిల్స్ విభజన కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. సర్కిల్స్ విభజన జరిగి దాదాపు ఆరు నెలలు పైగా గడుస్తున్నా.. సమస్యలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే ఏపీ సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ విభజనకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలోనే చేయాల్సిన విభజన కేవలం ప్రతిపాదన దశలోనే ఉండగా.. కార్యరూపంలోకి తీసుకొచ్చింది.

◆ ఆర్నెల్ల క్రితం ఏపీ సీపీడీసీఎల్‌లో కొత్త సర్కిల్స్ ఏర్పాటు
◆ కొత్తకార్యాలయాలను వేధిస్తున్న ఉద్యోగుల కొరత, వసతులు
◆ ఉద్యోగుల సర్దుబాటుపై కసరత్తు, నెలాఖరుకు డెడ్‌లైన్
◆ ఔట్ సోర్సింగ్‌లో బదిలీలపై ఆందోళన
◆ నేతల సిఫార్సులతో తలలు పట్టుకుంటున్న అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీపీడీసీఎల్ పరిధిలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కొత్త సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి గుంటూరు సర్కిల్‌లో కొత్తగా పల్నాడు సర్కిల్, బాపట్ల సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సర్కిల్స్‌కు ఎస్ఈలను, ఈఈలను ప్రభుత్వం నియమించింది. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని ఆయా సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అయితే నెలలుగా కార్యాలయాల్లో సరిపడా ఉద్యోగులు లేక కార్యకలాపాలు ముందుకు సాగే పరిస్థితి కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం ఆయా కార్యాలయాల్లో నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించలేదని ఉద్యోగుల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఆరు నెలల తర్వాత ఆయా కార్యాలయాలకు ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

విభజనపై విమర్శలు


ఇదిలా ఉంటే ప్రభుత్వం పరిపాలనా పరంగా జిల్లాలు, నైసర్గిక స్వరూపాల విభజనకు భిన్నంగా సీపీడీసీఎల్‌లో సర్కిల్స్ విభజన జరిగిందన్న విమర్శలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఉన్న చిలకలూరిపేట సబ్ డివిజన్ నేటికీ సీఆర్‌డీఏ సర్కిల్‌లోనే కొనసాగుతోంది. ఇక రేపల్లె సబ్ డివిజన్ బాపట్ల సర్కిల్ కు వెళ్లాల్సి ఉండగా నేటికీ గుంటూరు సర్కిల్‌లోనే కొనసాగుతోంది. ఇలా కొన్ని సబ్ డివిజన్‌లు, సెక్షన్‌లు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతుండటంపైనా కొందరు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు.

సర్దుబాటుపై కసరత్తు

ఇక ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. పలువురు జేఏసీలు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను కొత్త సర్కిల్స్‌కు బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. బదిలీ ప్రక్రియకు ఈ నెలాఖరు వరకు గడువు విధించినట్లు తెలిసింది. ఇప్పటికే అనేక మంది ఉద్యోగుల జాబితాను సిద్ధం చేశారు.

బదిలీలపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

ఇక సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ఉద్యోగుల బదిలీలకు కూడా రంగం సిద్ధం చేయడం కొంత గందరగోళానికి దారితీస్తోంది. జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ కార్యాలయంలో 31 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే ఇందులో దాదాపు 15 మంది వరకు ఉద్యోగులను పల్నాడు సర్కిల్ కార్యాలయ కేంద్రం నరసరావుపేటకు బదిలీ చేసేందుకు జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇక కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్‌కు కూడా ఒంగోలు సర్కిల్ కార్యాలయం నుంచి ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దాంతో ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో 33 మంది ఉద్యోగులు ఉంటే వారిలో పది మంది మందికి పైనే బాపట్లకు బదిలీ చేయాలని జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బదిలీల జాబితాలో చేర్చడం అన్యాయమంటూ వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి సాధారణ బదిలీల సమయాల్లో రెగ్యులర్ ఉద్యోగులకే ఈ ప్రక్రియ ఉంటుందని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల విధానమే ఉండదని వారు గుర్తుచేస్తున్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తుంటే జిల్లాలు దాటి ప్రయాణాలు చేయాలంటే వచ్చే జీతంలో సగం జీతం ఛార్జీలతో సరిపోతాయని వారు వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు దశాబ్దాలుగా పనిచేస్తున్నా.. కనీస జీతాలు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గుంటూరు సర్కిల్ కార్యాలయంలో బదిలీల జాబితాలో 70 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉండటం విశేషం. మహిళా ఉద్యోగులు అత్యధికశాతం ఉండటంతో అధికారులకు కొంత ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.



నేతల సిఫార్సులు

ఇక బదిలీల నుంచి తప్పించుకునేందుకు కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధికార పార్టీ నేతల నుంచి కూడా సిఫార్సులు చేయించుకుంటున్నారు. కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తోన్న సిఫార్సులు ఏ స్థాయిలో ఉంటున్నాయంటే అధికారులే తలలు పట్టుకునే పరిస్థితి ఉందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఉమ్మడి గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు -2 డివిజన్, అమరావతి డివిజన్‌లను కలిపి కొత్తగా సీఆర్‌డీఏ సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సర్కిల్ కార్యాలయంలో పనిచేసేందుకు ఉద్యోగుల కోసం కొత్తగా నియామకాలను చేపట్టారు. ఇలా వేరొక సర్కిల్ నుంచి ఉద్యోగుల బదిలీల వ్యవహారం లేదని గుర్తు చేస్తున్నారు. డివిజన్ కార్యాలయాల్లో ఉన్న వారిని సర్దుబాటు చేసుకొని, సర్కిల్ కార్యాలయానికి కొత్తగా నియామకాలతో ఉద్యోగులను నియమించుకున్నారని, అటువంటి ప్రక్రియ వదిలేసి వేరొక జిల్లా నుంచి సిబ్బందిని బదిలీ చేయడం సరికాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపశ్చిమ డెల్టా పరిసరాల్లో తాగు నీటి అవసరాల కోసం చెరువులు, బావులు నింపుకునేందుకుగానూ, విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి 1016 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటి మట్టం ఉండగా రేపల్లె కాల్వకు 144క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 96 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 45 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 151 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 514 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 21: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో నామమాత్రంగా 115బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.11,350, గరిష్టధర రూ.11,350, మోడల్‌ధర రూ.11,350 పలికాయి. కాయ కనిష్టధర రూ.11,350, గరిష్టధర రూ.12,400, మోడల్‌ధర రూ.11,350 పలికాయి.

జీవనోపాధి కల్పించండి

● తవ్వకాలు అడ్డుకున్న బోట్‌మెన్ సొసైటీ సభ్యులు



నావిగేషన్ పేరుతో ఇసుకను తీస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న బోట్‌మెన్ సొసైటీ సభ్యులు

తుళ్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాయపూడి ఇసుక రీచ్‌లో యంత్రాలతో తవ్వుతున్న పనులను బోట్‌మెన్ సొసైటీ సభ్యులు సోమవారం అడ్డుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీలో భాగంగా రాయపూడి ఇసుక రీచ్ నందు ఇసుక లభ్యత గురించి నీటి పారుదలశాఖ, మైనింగ్‌శాఖ జాయింటు ఇన్‌స్పెక్షన్ చేసి రాయపూడి గ్రామ పరిధిలో 11.94 హెక్టార్లలో 1,19,430 క్యూబిక్ మీటర్ల లభ్యత కలదని జిల్లా స్థాయి ఇసుక కమిటీ నివేదిక సమర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పక్కనే బోరుపాలెం ఇసుక రీచ్‌లో 1,53, 780 క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత కలదని నివేదిక ఉన్నారని తెలిపారు. ఇందులో భాగంగా బోట్‌మెన్ సొసైటీకి ఇసుక తవ్వకాల పనులు చూపించి జీవనోపాధి కల్పించాలని ఆ ఫిర్యాదులో కోరారు.



వట్టిచెరుకూరు నూతన ఎస్ఐగా సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సీఐ రమానాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. **(వట్టిచెరుకూరు)**

బడిబాట అవగాహన ర్యాలీ

కాకుమాను, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బడిబయట కార్యక్రమంలో నిర్వహించిన ఉపాధ్యాయులు డ్రాపవుట్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కెన్నడీ, విజయ్ భాస్కరరావు, హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు సర్టిఫికెట్లు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి కేవీఆర్ జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల్లో 11 మంది 2024-25 విద్యా సంవత్సరానికి దసరా సెలవుల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో ఆటోమోటివ్ ట్రేడ్ నందు ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. సదరు విద్యార్థులకు సోమవారం హైస్కూల్ హెచ్‌ఎం తాతిరెడ్డి ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆటోమోటివ్ ఇన్‌స్ట్రక్టర్ అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల సందర్శన

మంగళగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ నాయకులు సోమవారం లక్ష్మీనరసింహస్వామి కాలనీ, గణపతి నగర్, టిడ్కో సముదాయాల వద్ద గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు, ఓపీ, మందులు ఎలా అందుతున్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. థైరాయిడ్, హెచ్‌బీసీ టెస్టులు కూడా అందుబాటులో ఉంటే రోగులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, ఓబీసీ జిల్లా కార్యదర్శి బి.రవికిరణ్, కమల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ప్రయోజనాలపై అవగాహన సదస్సు

దుగ్గిరాల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, నిత్యం తాము తీసుకునే ఆహారంలో ప్రధానంగా ఆకుకూరలు, చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ అన్నారు. చిలువూరులోని అంగన్‌వాడీ కేంద్రం-3లో సోమవారం ఉదయం, పౌష్టికాహారం, దాని ప్రయోజనాలపై సర్పంచ్ చిలువూరు మాణిక్యం అధ్యక్షతన జరిగిన సదస్సులో భవాని మాట్లాడుతూ ఐరన్ అధికంగా ఉండే ఆకుకూరలు, ఇతర కూరగాయలు అధికంగా తీసుకోవాలని, చిన్నపిల్లలకు ఇచ్చే ఆహారంలో ప్రధానంగా చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా జబ్బుల బారిన పడకుండా చూసుకోవచ్చునన్నారు. గర్భందాల్చిన అనంతరం వెయ్యి రోజుల ప్రణాళిక ప్రకారం తల్లిబరువు, పుట్టాక పిల్లల బరువు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, వారికి అవసరమైన పోషకాహారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, కిశోర బాలికలు, బాలింతలు ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా రాణించేలా మహిళలకు ప్రోత్సాహం

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలుగా రాణించాలనుకునే మహిళలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహమిస్తుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలపరిధిలోని తిక్కిరెడ్డిపాలెం కోదండరామస్వామి కల్యాణ మండలంలో స్వయం సహాయక సంఘ సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా మార్చే విధి విధానాలపై నియోజకవర్గ స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నిర్వహించిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసుకోవడానికి ఈ ప్రభుత్వం అన్ని విధాలా చేయూత ఇస్తుందన్నారు. గతంలో లేని విధంగా ఎన్నో పథకాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్ని చిన్న వ్యాపారాల నుంచి పెద్ద యూనిట్లు పెట్టుకునే వరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి తరఫున అవకాశం ఉందన్నారు. మీకు ఎందులో అనుభవం ఉందో.. ఏ రంగంలో మీరు రాణించ గలరో ఆ రంగంలో వారికి అన్ని ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. అయితే స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుని వ్యాపారాలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉత్తర భారతదేశంలో గుర్రపు డెక్కతో గోనె సంచులు తయారు చేస్తున్నారని, ఇక్కడ మనం వేస్టుగా పరిగణించి పక్కన పడేస్తున్నామన్నారు. మహిళలు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చు కోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ మహిళలకు బంగారు బాట వేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. అందులో బాగంగానే గ్రామ స్థాయి నుంచి మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. ప్రతి గ్రామం నుంచి 10, 20 మంది మహిళలను గుర్తించి వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామన్నారు. అంతే కాకుండా త్వరలో పెమ్మసాని చొరవతో 43 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తామని, ప్రతి గ్రామం నుండి చదువుకున్న యువత ఈ జాబ్ మేళాలలో పాల్గొనాలని ఆయన కోరారు. తొలుత పెమ్మసాని, బూర్లకు డీఆర్‌డీఏ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు సందర్శించారు. మహిళలకు పోషకాహార కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు వందనాదేవి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, గింజుపల్లి శివరామప్రసాద్, అయినంపూడి నాగేశ్వరరావు, కల్లూరి కుసుమ, డీపీఎం రాంబాబు, ఏసీ చంద్రశేఖర్, అన్ని మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'స్వేచ్ఛ'

● కళాకారులకు జ్ఞాపిక, నగదు అందజేత



ఉత్తమ కళాకారులకు జ్ఞాపిక, నగదు అందజేస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు

పెదనందిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వరగాని లో ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి వారి సౌజన్యంతో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపిక, నగదు బహుమతులు అందజేశారు. ప్రజలకు హాస్యం, ఆహ్లాదం, ఆహార్యం, కనువిప్పు చేసే విధంగా సాగిన నాటిక పోటీల్లో న్యాయనిర్ణేతలు ఎన్ నాగభూషణం, ఎం సత్యనారాయణ, కే రామాంజనేయులు విజేతలను ఎంపిక చేశారు. ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చర్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ, ద్వితీయ ప్రదర్శనగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు, తృతీయ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురుమేఘం నాటిక, జ్యూరీ ఉత్తమ ప్రదర్శనగా మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికలు నిలవగా నటీ, నటీమణులకు, రచన, సంగీతం, దర్శకులకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ ఏడాది నుంచి నాగభైరు సుబ్బారావు అవార్డును అందజేస్తామని తెలిపారు. అనంతరం న్యాయనిర్ణేతలను కళా పరిషత్ సభ్యులు సత్కరించారు. కళాపరిషత్ గౌరవాధ్యక్షులు అధ్యక్ష కార్యదర్శులు ముద్దన రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావులు, చెరుకూరి సాంబశివరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, కొల్లా శ్రీనివాసరావు, జరుగుల రామారావు, పోపూరి శివరామప్రసాద్, చెన్నుపాటి సురేంద్రనాథ్, బండారు రాంబాబు, పోపూరి వెంకటప్పయ్య, రామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఫాతిమా మాత మహోత్సవాలు

● ముస్తాబైన వడ్లపూడి మిఖాయేల్ చర్చి ● నలుగురు బిషప్‌ల రాక



పెదవడ్లపూడిలోని పునీత మిఖాయేలు వారి పుణ్యక్షేత్రం

మంగళగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడిలో ఉన్న పునీత మిఖాయేల్ వారి పుణ్యక్షేత్రంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఫాతిమా మాత మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించి ప్రధాన చర్చి వద్ద సోమవారం సాయంత్రం జీడీఎస్ఎస్ అండ్ డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఫాదర్ ఉన్నం కిరణ్‌కుమార్ జెండా ప్రతిష్ఠించి దివ్య బలిపూజ ద్వారా సంప్రదాయంగా వేడుకలకు శ్రీకారం చుట్టారు. రెండు తెలుగురాష్ట్రాలకు కలిపి ఈ వేడుకలను మూడు రోజులపాటు వడ్లపూడిలో అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. 1902లో ఏర్పాటైన ఈ పునీత మిఖాయేల్ చర్చిలో అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ వేడుకలను నిర్వహించడం ఓ ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది.

వేడుకలలో తొలిరోజైన మంగళవారం ఉదయం 11గంటలకు దివ్య సత్ప్రసాద ఆరాధన, స్వస్థతా ప్రార్థనలు, మధ్యాహ్నం మూడు గంటలకు కరుణ జపమాల నిర్వహించి గ్రామ వీధుల్లో దివ్య సత్ప్రసాద ప్రదక్షిణ నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం ఆరున్నర గంటలకు పరిశుద్ధ జపమాల, దివ్య బలిపూజ, వాక్యపరిచర్య నిర్వహిస్తారు. రెండో రోజు 23వ తేది ఉదయం దివ్య సత్ప్రసాద ఆరాధన నిర్వహించి సాయంకాలం కరుణ జపమాల నిర్వహించి దివ్య బలిపూజ, వాక్య పరిచర్య చేస్తారు. మూడో రోజైన 24వ తేది సాయంత్రం ప్రధాన మందిరం వద్ద మహోత్సవ సమిష్టి దివ్య పూజాబలిని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు బిషప్‌లు హాజరుకానున్నారు. గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య, విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజా, ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాష్, నెల్లూరు పీఠాధిపతి పిల్లి ఆంథోనిదాస్ తోపాటు మరో 70 మంది ఫాదర్‌లు హాజరుకానున్నారని విచారణ గురువు నల్లపాటి శౌరి తెలిపారు.


కేఎల్‌యూలో నూతన ఆవిష్కరణలపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏసీ ఐసీ సీఈవో రమణకాంత్ తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో అంకుర సంస్థలు నూతన ఆవిష్కరణలు ఏర్పాటు చేయడంలో కావలసిన నైపుణ్యాలను ఎలా మెరుగుపరచుకోవాలి అనే అంశంపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. సదస్సును ఏసీ ఐసీ సీఈవో డాక్టర్ రమణకాంత్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ రమణకాంత్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు ఏర్పాటు చేయడానికి ప్రతిఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సదరు ఆవిష్కరణలు ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంహెచ్ఎస్ డీన్ ఎం కిషోర్‌బాబు, వీసీ సారధివర్మ, కామర్స్ విభాగాధిపతి శాంతకుమారి, ఉప విభాగాధిపతి, షాహిద్ షాకర్ అహ్మద్, వెంకటేశ్వరకుమార్, రిజిస్ట్రార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



ప్రాతూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నేతలు

తాడేపల్లి (కుంచనపల్లి), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా ఆదేశాలకు తలొగ్గి అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు జరుగుతుండగానే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ భారత దేశానికి రావడం ఏఐకేఎస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ అన్నారు. ఎంటీ ఎంసీ పరిధిలోని కుంచనపల్లి ప్రాతూరు జాతీయ రహదారి వద్ద రైతు సంఘం ఆధ్వ ర్యంలో వాన్స్ గో బ్యాక్ నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా దాసోహమైందన్నారు. దేశంలో వ్యాన్స్ పర్యటన బహుళజాతి కంపెనీలకు లాభాలు చేకూర్చడానికేనని చెప్పారు. కార్యక్రమంలో ఎం శ్రీనివాసరెడ్డి, కే వెంకటేశ్వరరావు, పీ కృష్ణ, డీ వెంకటరెడ్డి, శ్రీనివాసకుమారి, బక్కిరెడ్డి సురేష్, విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై తల్లులకు అవగాహన

మంగళగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణాయపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలపై తల్లులకు అవగాహన కల్పించారు. వెయ్యి రోజుల కేర్ గురించి తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలుపోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

పెదనందిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. బలహీన వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయిస్తామని, ఈ నెల 25 నుంచి మే 15వరకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2025 మార్చి 1 నాటికి 5సంవత్సరాలు నిండిన వారు 1వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్న బీజేపీ

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో భారత రాజ్యాంగ పరిరక్షణ మన కర్తవ్యం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని, జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరగాలన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా రాజ్యాంగ పరిరక్షణకై పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జాషువా విజ్ఞాన కేంద్ర నిర్వాహకుడు పాశం రామారావు, కేంద్ర నిర్వాహకుడు దొప్పలపూడి రమేష్‌బాబు, ముద్దన వెంకటేశ్వర్లు, కాపు వెంకటసుబ్బారావు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, నల్లమోతు రాజేంద్ర, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

పెదనందిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాంప్లెక్స్ ఎదుట జరుగుతున్న సైడు కాల్వల నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. గతంలో దుకాణాల యజమానులు సైడు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలపగా జిల్లాపరిషత్ నిధులు రూ.3.60లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీదేవి ఉన్నారు.

రేపటి నుంచి అద్దంకమ్మ తిరునాళ్ల ప్రారంభం



అమ్మవారి మూలవిరాట్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామ ప్రజల ఇలవేల్పు అద్దంకమ్మవారి తిరునాళ్ల ఈ నెల 23వ తేదీ రాత్రి గ్రామ నడిబొడ్డున మారెమ్మ ప్రతిష్ఠతో అద్దంకమ్మవారి తిరునాళ్ల ప్రారంభం కానున్నది. 24వ తేదీ ఉదయం మారెమ్మకి సద్ది నైవేద్యాలు సమర్పించిన అనంతరం ఊరేగింపుగా గ్రామానికి తూర్పు వైపున అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. అదేరోజు పోలేరమ్మ ఆలయం వద్ద కొలుపులు, 25వ తేదీ పోలేరమ్మ గుడి నుంచి అద్దంకమ్మ గుడి వద్దకు ఊరేగింపుతో సిడిమాను తరలింపు, 26వ తేదీ గ్రామంలోని అమ్మవారికి కుంకుమ బండ్ల ఊరేగింపు, ఈనెల 27వ తేదీ సాయంత్రం తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన సిడిమాను ఊరేగింపు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం, 28వ తేదీ పొంగలి నైవేద్యాలు సమర్పించటంతో తిరునాళ్ల ముగియనున్నది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తుంది.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● సీఐ రమానాయక్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెడు వ్యసనాలకు గురి కాకుండా స్వీయ క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సీఐ రమానాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని లేమల్లెపాడు ఎంపీపీ స్కూల్లో 97వ వార్షికోత్సవం 7వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోల కార్యక్రమానికి సీఐ రమానాయక్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు చెడు వ్యసనాల కలిగే అనర్థాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ కేవలం అధ్యాపకుడిగా కాకుండా దాతల సహాయ సహకారాలతో పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. తాను స్కూల్ ప్రమోటర్‌గా ఉంటానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతూరి శివపార్వతి కృష్ణారావు, ఎంపీటీసీ కే నాగరాజకుమారి, అధ్యాపకులు వీ శ్రీనివాసరావు, ఎం రవికృష్ణ, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎస్తేర్‌రాణి, వైస్ ఛైర్మన్ పీ చైతన్య, కే బుల్లిబాబు తదితరులు పాల్గొనగా ప్రతిభావంతులైన విద్యార్థులకు సీఐ రమానాయక్ బహుమతులు పంపిణీ చేశారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ రమానాయక్, హెచ్‌ఎం

నేడు కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్ల



కొండపాటూరు స్వయంభు పోలేరమ్మ ఆలయం

కాకుమాను, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పోలేరమ్మ తిరునాళ్లకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ ముత్తినేని అనీల్‌కుమార్, మేనేజర్ సురేష్‌బాబు సోమవారం తెలిపారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. తిరునాళ్లలో ప్రధాన ఘట్టం అయిన శిడిమాను మహోత్సవాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని ఆలయ కార్యనిర్వాహక అధికారి తెలిపారు. బాపట్ల, పొన్నూరు, గుంటూరు, చిలకలూరిపేట నుంచి స్పెషల్ కొండపాటూరు బస్సులను కూడా ఆయా డిపో మేనేజర్‌లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం శిడిమాను ట్రయల్‌రన్ నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆలయం వద్ద వివిధ రకాల దేవతమూర్తుల ఆకృతులతో కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

ఉండవల్లిలో ప్రీమియర్ నాకౌట్ లీగ్ పోటీలు



ప్రీమియర్ నాకౌట్ లీగ్ పోటీలు ప్రారంభించిన జొన్నా రాజేష్

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి దేవుడి మాన్యంలో సోమవారం ఉదయం ప్రీమియర్ నాకౌట్ క్రికెట్ లీగ్ పోటీలను జనసేన నియోజకవర్గ నాయకులు జొన్నా రాజేష్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ 44 టీమ్స్, 20 మ్యాచ్‌లు 9 రోజులపాటు జరగనున్నాయని, చెప్పారు. టాస్‌లో గెలిచిన 11 రైజర్స్ బ్యాటింగ్ సెలెక్ట్ చేసుకోగా ఇరు జట్లకు రాజేష్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి క్రీడా స్ఫూర్తి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో లీగ్ నిర్వహకులు జయరామ్, నవీన్, నాగార్జున, దినేష్‌రెడ్డి, షేక్ ఘని తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనపై రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించే విషయంలో ఆయా రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓబీసీల సాధికారతకు దోహదపడే సమగ్ర కులగణన నిర్వహించేందుకు అధికారంలో లేనప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం రాజకీయ పార్టీలకు తగదన్నారు. బీజేపీ అగ్రనేతలు జనగణనతోపాటే సమగ్ర కులగణన జరుపుతామని హామీని ఇచ్చి ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. ఓబీసీల అభివృద్ధి, సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రభుత్వాలు వెంటనే కులగణన జరిపి దేశం లోను, రాష్ట్రంలోను బీసీలు ఎంతమంది ఉన్నారో తేల్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రాతూరులో స్వచ్ఛ మంగళగిరి



చెత్తను శుభ్రం చేస్తున్న టీడీపీ శ్రేణులు, మున్సిపల్ సిబ్బంది

తాడేపల్లి (ప్రాతూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ప్రాతూరులో టీడీపీ నేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుగా ఉంచి కార్మికులకు అందించాలని స్థానికులను కోరారు. పరిసరాల శుభ్రత నిత్యం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ డీఈ శ్రీకాంత్, జనసేన గ్రామ అధ్యక్షుడు సంకురు విజయకుమార్, పాటిబండ్ల రాము, వసంతరావు, జోషి, మున్సిపల్ సిబ్బంది, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చిర్రావూరులో పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న వీరశెట్టి శ్రీనివాస్ తదితరులు

తాడేపల్లి (చిర్రావూరు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి మండలం చిర్రావూరుకు చెందిన యాదగిరి శ్రీనివాసరావు కుమారుడి వివాహానికి హాజరై వధూవరులు చైతన్య-కిరణ్‌లకు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుకను అందజేసి ఆశీర్వదించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ అధ్యక్షుడు వీరశెట్టి శ్రీనివాస్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో టీడీపీ సభ్యత్వకార్డుల పంపిణీ



దుగ్గిరాలలో టీడీపీ సభ్యత్వ కార్డులను ఓటర్లకు అందిస్తున్న తెలుగుయువత సభ్యులు

దుగ్గిరాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్డులను దుగ్గిరాలలో నూతన సభ్యులతో పాటు రెన్యువల్ చేయించుకున్న వారికి కొత్తకార్డుల పంపిణీ కార్యక్రమం 273వ పోలింగ్ బూత్ పరిధిలో రెండోరోజు కొనసాగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని, పార్టీ సభ్యత్వ కార్డులను ప్రారంభించిన విషయం విదితమే. దుగ్గిరాలలో టీడీపీ సభ్యత్వం కోరుతూ స్వచ్ఛందంగా ఫొటో, వివరాలందించిన వారి ఇళ్లకువెళ్లి పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను అందించారు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో సభ్యులకు కార్డులను అందిస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్డుల పంపిణీలో నక్కా చిరంజీవి, దాసరి బాబూరావు, పెర్లి వంశీ, నాయుడు శ్రీధర్, కంచర్ల గోపాల్, రాము, సందీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు మట్టి సేకరణ ప్రారంభం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా భూమిలో గుర్తించిన లోపాలకు అనుగుణంగా ఎరువుల వినియోగం ద్వారా భూసారం పెరగటంతో పాటు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. మట్టి నమూనా సేకరణ కార్యక్రమంలో ఏఏవోలు షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం స్వీకరించాలని సీడీపీవో ఎస్.వెంకటరమణ అన్నారు. వసతివాడ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లిన అంగన్‌వాడీ కార్యకర్తలు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆకుకూరలు, చిరుధాన్యాల ఆవశ్యకతను తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఎత్తు, బరువులను చూసి పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారుల తల్లులకు అంగన్‌వాడీ కేంద్రాలలో లభించే సౌకర్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విద్యుత్‌కు ప్రైవేట్ చిక్కులు

● స్తంభాలపై కుప్పలుగా వైర్లు
● మరమ్మతులు చేయాలంటే తిప్పలు



ఎరువుల కొట్ల బజార్ రోడ్డులో విద్యుత్ స్తంభానికి వేళాడుతున్న ప్రైవేట్ కేబుల్ వైర్ల చుట్టలు



టూటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని స్తంభానికి వేళాడుతున్న ప్రైవేట్ కేబుల్ వైర్లు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు ప్రైవేట్ సంస్థల కేబుల్స్, నెట్‌వైర్లు తగిలించడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. తెనాలి పట్టణంలో 40 వార్డులు ఉండగా ఆయా ప్రాంతాలకు విద్యుత్ కనెక్షన్స్ కోసం ఆ శాఖ స్తంభాలను ఏర్పాటు చేసింది. ఆ స్తంభాలకు నిబంధనల ప్రకారం విద్యుత్ శాఖ వైర్లు మాత్రమే అమార్చాల్సి ఉంటుంది. అయితే ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు ఇంటర్‌నెట్, కేబుల్ కనెక్షన్స్ వంటి వాటికి స్తంభాలను ఏర్పాటు చేసుకోకుండా విద్యుత్ శాఖ స్తంభాల చుట్టూ కేబుల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. వర్షాకాలం, ఎండా కాలాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ లోడ్ హెచ్చుతగ్గులు ఏర్పడే క్రమంలో సర్వీస్ వైరుకు అనుసంధానంగా చేసిన వైర్లు కరిగి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆయా సమయాల్లో తిరిగి విద్యుత్ లైన్ల నుంచి తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభాలను ఎక్కవలసి ఉంది. ప్రైవేట్ కేబుల్స్‌ను తప్పించుకొని స్తంభాలను ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. ఒకానొక సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించినపుడు ఆయా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ప్రైవేట్ కేబుల్స్ తగలబడటం ప్రమాదకరంగా మారుతున్నాయి. జనావాసాలకు సమీపంలో ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటే పూరిల్లు అగ్నిప్రమాదాల భారిన పడి ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టం వంటివి జరిగే ప్రమాదాలు లేకపోలేదు. ఇటీవల కాలంలో పినపాటు రోడ్డులో విద్యుత్ స్తంభం వద్ద షార్టు సర్క్యూట్‌లో నిప్పులు చెలరేగి పంటలు పూర్తిచేసుకున్న వరిగడ్డికి ఆ రవ్వలు పడి మంటలు చెలరేగిన ఘటనలు కూడా రైతుల్లో ఆందోళన కల్గించాయి. ఇప్పటికైన అధికారులు ప్రమాదకరంగా ఉన్న ప్రైవేట్ నెట్ వర్క్ వైర్లను పరిశీలించి సురక్షిత చర్యలు చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

గ్రీవెన్స్‌కు 14 దరఖాస్తులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 దరఖాస్తులు అందించారు. రెవెన్యూ సమస్యలు 6, పోలీసు శాఖకు సంబంధించి 4, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బీ, విద్యుత్, మున్సిపల్ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందజేశారు. సంబంధిత దరఖాస్తులను అధికారులకు పంపి పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ దరఖాస్తుదారులకు తెలిపారు.

చినరావూరు పార్కు రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని వినతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని చినరావూరు పార్కు రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావును వార్డు ప్రజలు కోరారు. సోమవారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి ఒక ఆర్జీ, టౌన్ ప్లానింగ్ విభాగానికి రోడ్డు ఆక్రమణలు తొలగించాలని ఒక ఆర్జీ వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ సంబరాలకు ఆహ్వానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో జరగనున్న తెలుగు సాహితీ సంబరాలకు తెనాలికి చెందిన సాహిత్యవేత్త కొప్పురపు నారాయణమూర్తికి ఆహ్వానం లభించింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మే 10న ఈ సంబరాలు నిర్వహించనున్నారు. నారాయణమూర్తి సాహితీ సేవలను గుర్తించి సంబరాలకు ఆహ్వానం అందుకున్న ఆయనను పలువురు కళాకారులు అభినందించారు.

4న అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో మే4న అన్నమయ్య పోటీలు నిర్వహించనున్నారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో సోమవారం పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో 8-50 సంవత్సరాల గల గాయకులు పాల్గొనవచ్చునని తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ రెండు స్థాయిల విభాగాల్లో విజేతలకు నగదు బహుమతులు అందిస్తారు. ఆసక్తి కలిగిన గాయకులు 9246440685లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, సుబ్బారావు, రజనీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

● ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేష్

కొల్లిపర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఉప్పాల రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు దరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదికకు అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గ్రీవెన్స్‌కు హాజరైనవారిలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఎంఈవో సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోడల్ స్కూల్‌లో చేర్పించాలి: ఎంఈఓ సాల్మన్‌రాజు

కొల్లిపర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు విద్యార్థులను మోడల్ స్కూల్‌లో చేర్పించాలని ఎంఈవో సాల్మన్‌రాజు కోరారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర చెరువుకట్ట వద్ద ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మోడల్ స్కూల్ కావడంతో ఉపాధ్యాయులు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3,4,5 తరగతులు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ఆ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్‌లో విలీనం చేయడం జరిగిందని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ స్కూల్‌కి పంపించాలని ఎంఈవో కోరారు.

మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. సంఘ సభ్యులు వడ్లమూడి రత్నమాణిక్యం జ్ఞాపకార్థం కుమార్తె, అల్లుడు కనకమేడల విజయకుమారి, విజయకుమార్, తూనుగుంట్ల వెంకట సుబ్బమ్మ 4వ వర్ధంతి సందర్భంగా కొడుకు కోడలు తూనుగుంట్ల వెంకటాచలం, సుధారాణి సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్
మృతిపై కేసు నమోదు



కూచిపూడి క్రాంతికుమార్ (ఫైల్‌ఫొటో)

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కూచిపూడి క్రాంతికుమార్ మృతిపై చేబ్రోలు పోలీసులు సోమవారం అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. చేబ్రోలు ఎస్‌ఐ వెంకట కృష్ణ కథనం ప్రకారం వడ్లమూడి గ్రామానికి చెందిన కూచిపూడి క్రాంతికుమార్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గుంటూరు చుట్టుకుంట ప్రాంతంలోని కేవీపీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 18న గుడ్ ఫ్రైడే రోజు ద్విచక్ర వాహనం పై వడ్లమూడి బయలుదేరి వెళ్లాడు. మార్గ మధ్యలో నారాకోడూరు వద్ద క్రాంతికుమార్ రోడ్డు పక్కన పడిపోయి ఉండగా స్థానికులు వడ్లమూడిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ క్రాంతికుమార్ మృతి చెందాడు. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో అనుమానించిన భార్య ప్రవీణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ వెంకట కృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఇంటర్మీడియట్ విద్యా పెన్షనర్లు

విద్యా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దారుకు పెన్షనర్ల సంఘం నాయకుల వినతి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ విద్యా పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి రావాల్సిన డీఆర్ ఎరియర్స్, 11వ పీఆర్సీ ఎరియర్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లు సాధించుకున్న అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 15శాతంకు రెస్టోరేషన్ చేయాలని కోరారు. మెడికల్ రీయింబెర్స్‌మెంట్ రూ.5లక్షల వరకు పెంచాలని ఎయిడెడ్ రంగానికి సంబంధించి పెన్షనర్లు అందరికీ మెడికల్ రీయింబర్స్‌మెంట్ అందాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే నియమించి ఐఆర్ ప్రకటించాలని, మూడు పెండింగ్ డీఆర్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంటర్‌మీడియట్ విద్యా పెన్షనర్లు ఎస్.ఆంజనేయులు నాయుడు, రఘుబాల, కుసుమకుమారి, అబ్దుల్ అజీజ్, మధురవాణి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

కొల్లిపర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వెంకటలక్ష్మి మాట్లాడుతూ గర్భవతులు ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. బాలింతలు, గర్భిణులు, కిషోరి బాలికలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ యోజనపై అవగాహన



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హనోక్‌బాబు, నాగకిషోర్ తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పినపాడులోని సచివాలయం- 2లో ఆయుష్మాన్ భారత్ యోజనపై పాండురంగ పేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ హనోక్‌బాబు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్‌కు అవగాహనా కార్యక్రమాన్ని సోమారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ద్వారా ప్రతి కుటుంబానికి చికిత్స, మందులు, పరీక్షలు.. ఇలా వైద్య ఖర్చులు రూ.5 లక్షల కవరేజీ అందిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ యోజనకు ఆధార్ లేదా పాన్ కార్డు, మొబైల్ నెంబర్, కులధ్రువీకరణ ఈకేవైసీ చేసి కార్డును పొందాలని సూచించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలపై అవగాహన కల్పించారు. సచివాలయ పరిధిలోని 70 మందికి ఈకేవైసీ చేసి, కార్డులను అందజేశారు. టీం లీడర్ కె.నాగకిషోర్, రవి, వైద్యమిత్రా సురేష్, ప్రసన్న పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.జనార్దనన్

వీవీఐటీయూలో
'ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం'

పెదకాకాని, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ అధ్యాపకులకు పాఠ్యాంశ రూపకల్పన, అభివృద్ధిపై మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం వీవీఐటీలో నిర్వహించారు. జాతీయ సాంకేతిక అధ్యాపకుల శిక్షణ, పరిశోధన సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై) ఆచార్యులు డాక్టర్ జి.జనార్దనన్, డాక్టర్ వి.షణ్ముగనిధి ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ విద్యావిధానం 2020 దృష్టి సూత్రాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సూచనలను అనుసరించి కోర్సులను నిర్ణయించటంలో క్రమబద్ధమైన పద్ధతులపై అవగాహన పెంపొందించారు. సదస్సులో డాక్టర్ జి.జనార్దనన్ మాట్లాడుతూ ప్రస్తుతం వీవీఐటీ విశ్వవిదాలయంతో కలసి పని చేసేందుకు రూపొందించిన ఒప్పందం ప్రకారం విశ్వవ్యాప్త బోధనాపరమైన ప్రమాణాలను నెలకొల్పుతామని వివరించారు. ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో రూపొందించే ప్రతి కోర్సుకు లేబరేటరీని అనుసంధానించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, డైరెక్టర్ రావెల నవీన్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల దాడి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుల మధ్య ఏర్పడిన ఘర్షణ దాడికి దారి తీసింది. త్రీటౌన్ పోలీసులు వివరాల ప్రకారం పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేసే ఇద్దరు యువకుల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో భాస్కర్ అనే యువకుడిపై జోసఫ్ బాటిల్‌తో దాడిచేయడంతో రక్త గాయాలు అయ్యాయి. ఇతర సిబ్బంది గమనించి బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలపగా దాడిపై బాధితుడు సోమవారం ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

స్పందనకు 9 అర్జీలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఏడు అర్జీలు సర్వే కోసం, ఇతర సమస్యలతో రెండు అందాయన్నారు. పలువురు మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడి
పర్యటనపై నిరసన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటన పట్ల సీపీఎం నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమ అమెరికా పన్నుల కారణంగా మరింత దెబ్బతింటాయన్నాయని ఆరోపించారు. అమెరికా పన్నుల విధానాన్ని సమీక్షించాలని డిమాండ్ చేశారు. ములకా శివసాంబిరెడ్డి, సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, రాజీవ్‌కుమార్, రాజారావు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో విశేష పూజలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని కోదండ రామాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. రామభక్త అప్పలస్వామి గుడిగా పిలుచుకునే ఈ ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారికి 16రోజుల పండుగ నిర్వహించారు. దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పూజా కార్యక్రమాల్లో ధర్మకర్తలు నారాయణస్వామి, శివాంజనేయ ప్రసాద్, రాంబాబు, సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

కవల దూడలకు జన్మనిచ్చిన ఆవు



కవల దూడలతో పశుపోషకుడు వీరరాఘవయ్య

తెనాలి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందులపేటలో ఆవు కవల దూడలకు జన్మనిచ్చింది. తాడిబోయిన వీరరాఘవయ్యకు ఆవులను పెంచడం అంటే ఎంతో మక్కువ. ఈ క్రమంలోనే ఒంగోలు జాతి ఆవును పెంచుతున్నాడు. దీనికి మూడోసారి గర్భధారణకు తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని వెటర్నరీ వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డిని సంప్రదించగా గర్భం దాల్చేందుకు ఇంజక్షన్లు అందించారు. ఆ ఆవు నెలలు నిండి సోమవారం కవలలకు జన్మనిచ్చింది. అందులో ఒకటి మగదూడ కాగా మరొకటి ఆడదూడలు పుట్టాయి. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి ఆసక్తిగా తిలకించారు.



పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేస్తున్న గల్లా జ్ఞానశేఖర్

పాఠశాలకు రూ.20వేల మైక్‌సెట్ బహూకరణ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజెండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సోమవారం రూ.20వేలు విలువైన స్పీకర్ సిస్టమ్ మైక్ సెట్‌ను బహూకరించారు. జ్ఞానీ ప్రాజెక్ట్స ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ డైరెక్టర్ గల్లా జ్ఞానశేఖర్ విద్యార్థులకు అవసరమైన ఈ స్పీకర్ సిస్టమ్‌ను అందించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి, ప్రేరణ శిక్షణ సేవా సమితి డైరెక్టర్ నోటు నాగార్జున, ఎస్ఎంసీ చైర్మన్ భువనేశ్వరి, సాంబశివరావు, ఉపాధ్యాయులు, లక్ష్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతి వరకు కొనసాగించాలి

● అధికారులకు అన్నవరం లంక గ్రామస్తుల వినతి

కొల్లిపర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నవరంలంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులు వరకు మాత్రమే కొనసాగిస్తున్నారని దానిని 5వ తరగతి వరకు కొనసాగించాలని కోరుతూ సోమవారం అన్నవరంలంక గ్రామస్థులు ఎంపీడీవో విజయలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేష్, ఎంఈవో సాల్మన్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. 3,4,5 తరగతుల విద్యార్థులను హైస్కూల్‌కు పంపించడం వలన దూరం కావటంతో పలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అధికారులకు తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలలోనే 3,4,5 తరగతులను కొనసాగించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో కనపాల దేవదాసు, పందిపాటి నల్లయ్య, గురిందపల్లి విజయసారథి, పందిపాటి ఇమ్మానియేల్, గురివిందపల్లి సామ్యూల్ తదితరులు ఉన్నారు.



ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న అన్నవరం లంక గ్రామస్తులు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు, పలు సంఘాల ప్రతినిధులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

● సబ్ కలెక్టర్‌కు పలు సంఘాల ప్రతినిధుల వినతి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు, పలు సంఘాల ప్రతినిధులు కోరారు. సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంజన సింహాకు వినతిపత్రం అందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26, 30, 30ఏ కు వ్యతిరేకంగా చట్టం రూపొందించారని ముస్లిం సంఘాల ప్రతనిధులు పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను భిన్నంగా వ్యహరించకుండా ముస్లింలకు న్యాయం చేయాలన్నారు. దళిత లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సాగర్, బుద్ధిస్టు సొసైటీ కార్యదర్శి అశోక్‌కుమార్, తెనాలి పట్టణ మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ సురేంద్రకు బంగారు పతకం అందజేస్తున్న వైద్యులు

డాక్టర్ సురేంద్రకు బంగారు పతకం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మోహన్‌దాస్ స్మారక బంగారు పతకాన్ని ప్రముఖ వైద్యుడు సురేంద్రకు ప్రదానం చేశారు. పట్టణానికి చెందిన డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ వర్ధంతి బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోహన్‌దాస్ స్మారక బంగారు పతకాన్ని ప్రముఖ వైద్యులు సురేంద్రకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వాస్కులర్ సర్జరీ స్మాల్ బిగినింగ్ టు నై ఫ్లోరిషింగ్ అనే అంశంపై స్మారక ఉపన్యాసం చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనీల్‌కుమార్, వైద్యులు పావని ప్రియాంక, శ్యాంప్రసాద్, చందు సాంబశివుడు, శేషగిరిరావు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు పనిముట్లు అందించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

తెనాలి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసే కార్మికులకు పనిముట్లు అందించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అంగలకుదురులో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేస్తున్న వ్యవసాయ కూలీలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డితో కలిసి అప్పారావు పరామర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికుల కష్టసుఖాలను తెలుసుకుని మాట్లాడుతూ... గత మూడేళ్లుగా ఇదే గ్రామంలో ఉపాధిహామీ పనులకు రైతు కూలీలు వచ్చి పనులు చేస్తున్నారన్నారు. ఐతే వారికి అవసరమైన పనిముట్లను ప్రభుత్వం అందించటం లేదని, మెడికల్ కిట్లు, పలుగు, పార ఖర్చుకింద డబ్బులు కూడా ఇవ్వడంలేదన్నారు. కూలీలకు మజ్జిగ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదని అందులో భాగంగానే నిధులు తగ్గించేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో, పలు జిల్లాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు నిర్ణీత సమయంలో కూలి డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు తక్షణమే బకాయిలు విడుదలచేయాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు
రూ.2లక్షల చెక్కు అందజేత

కొల్లిపర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్యాన్సర్ వ్యాధితో అబ్బగాని తిరుపతమ్మ మృతి చెందింది. మృతురాలికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా ఉండటంతో సోమవారం కొల్లిపర స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ అన్నపరెడ్డి రమేష్ రూ.2లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.